ప్రతిపక్షం

www.prathipaksham.in

బుధవారం 25.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 336 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



జట్టులోకి అక్షర్ పటేల్ 10



లొంగిపోయిన దేవ్ జీ

బడే చొక్కారావు, నూనె నర్సింహారెడ్డి, మల్లా రాజిరెడ్డి కూడా

- అనారోగ్య కారణాల వల్లే లొంగుబాటు
- ఇక ప్రజల్లో ఉండి పోరాటం చేస్తా: దేవ్‌జీ
- మావోయిజం ఎప్పటికీ ముగిసిపోదు
- అభివృద్ధి చెందుతూనే ఉంటుంది: మల్లా రాజిరెడ్డి
- తెలంగాణలో మావోయిస్టు వ్యవస్థ నిర్వీర్యం
- మిగిలిన వారూ సమాజ వికాసంలో భాగస్వాములు కావాలి
- రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి పిలుపు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 24 : మావోయిస్టు అగ్రనేతలు మంగళవారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. మావోయిస్టు పార్టీలో కీలక విభాగాలైన పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యులుగా ఉన్న అగ్ర నేతలు జనజీవన స్రవంతి లోకి వచ్చారు. లొంగిపోయిన వారిలో పొలిట్ బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ , తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ , రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనే నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న ఉన్నారు. దశాబ్దాల కాలంగా అడవుల్లో ఉంటూ సాయుధ పోరాటాన్ని నడిపిన వీరు, పోలీసుల ముట్టడి, అనారోగ్య కారణాలతో తుపాకీ వీడారు.

తెలంగాణలో మావోయిస్టు వ్యవస్థ నిర్వీర్యం: డీజీపీ

రాష్ట్ర కమిటీ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యులు లొంగిపోవడంతో తెలంగాణలో మావోయిస్టు వ్యవస్థ నిర్వీర్యమైందని డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ కేంద్ర, రాష్ట్ర స్థాయి

...:: మిగతా 2లో



అనారోగ్య కారణాల రీత్యా నేను లొంగిపోయాను. రహస్య జీవితం నుంచి బహిరంగ జీవితం గడపాలని భావిస్తున్నాను. దశాబ్దాల కాలం నుంచి నేను నమ్మిన సిద్ధాంతాల ప్రకారమే ప్రజల కోసం పనిచేస్తాను. ప్రజల సమస్యలపై ప్రజల్లో ఉండి పోరాటం చేస్తాను. త్వరలో రాజకీయ ప్రవేశం చేసి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని భావిస్తున్నాను. మీరు అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పే పరిస్థితిలో లేను. నేను ఏది మాట్లాడినా అపార్థాలకు దారితీసే విధంగా ఉంటుంది. నేను రాజకీయ జీవితం కొనసాగించాలని కోరుకుంటున్నాను. మీరడిగే ప్రశ్నలకు నేను చెప్పే జవాబు.. రాజకీయ జీవితానికి ఇబ్బంది కలిగించవద్దని అన్ని విషయాలు పంచుకోవడం లేదు. - దేవ్‌జీ



"మేం ప్రజల సమస్యలపై వారి తరపున కలిసి పనిచేస్తాం. పార్లమెంటరీ వ్యవస్థలోకి వెళ్లాలనేది మా ఉద్దేశం కాదు. ప్రజల సమస్యలపై జరిగే పోరాటాలను సంఘటితం చేయడం కోసం చట్ట పరిధిలో పనిచేయాలని లోతుగా ఆలోచించాం. అవకాశం ఉన్నప్పుడల్లా ప్రజల పోరాటాలకు మద్దతుగా నిలబడతామని హామీ ఇస్తున్నాం. మావోయిజం మాత్రం ఎప్పటికీ ముగిసిపోదు. ప్రపంచవ్యాప్తంగా అది అభివృద్ధి చెందుతూనే ఉంటుంది" - మల్లా రాజిరెడ్డి

జైలులో పెడితే భయపడం

బాల్క సుమన్ కొత్తగా జైలుకుపోలేదు



- మున్సిపాలిటీ ఎన్నికలలో అక్రమంగా వ్యవహరించారు
- బీఆర్ఎస్ నాయకులపై గూండాలతో దాడులు చేశారు
- అక్రమాలను ప్రశ్నించినందుకు సుమన్‌ను జైల్లో పెట్టారు
- కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం

ప్రతిపక్షం ప్రతినిధి, ఆదిలాబాద్

ఫిబ్రవరి 24: జైలులో పెడితే మా నాయకులు భయపడుతారని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారని, ఇలాంటి ఉడుత ఊపులకు తాము భయపడబోమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బాల్క సుమన్ ఇవాళ కొత్తగా జైలుకుపోలేదని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఆరు నెలలు జైల్లో ఉన్నాడని తెలిపారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ బాల్క సుమన్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మున్సిపాలిటీల్లో అక్రమంగా అధికారాన్ని హస్తగతం చేసుకుందని కేటీఆర్ ఆరోపించారు. ఆదేమని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించిందని విమర్శించారు. క్యాతన్‌పల్లిలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలో జరిగిన అక్రమాన్ని ప్రశ్నించినందుకు బాల్క సుమన్‌ను జైల్లో పెట్టారని

...:: మిగతా 2లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.27 (బుధవారం సాయంత్రం)

సహర్ – 5.15 (గురువారం ఉదయం)



మోడీ తీరు ఏకపక్షం

యుద్ధ నిర్ణయాల నుంచి అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వరకు అన్ని అంశాల్లో ప్రధాని మోడీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశ భద్రత, రైతుల ప్రయోజనాలు, పార్లమెంటరీ వ్యవస్థ అన్నీ ప్రమాదంలో పడుతున్నాయన్నారు.

9



ఆర్టీసీ 'మీ సేవ' మొబైల్ యాప్

- యాప్ ద్వారా బస్ టికెట్లు, పాసులు పొందే సౌకర్యం
- సేవలను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

...:: వివరాలు 2లో

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 5 నిముషాలు ఆలస్యంగా వచ్చినా విద్యార్థులకు అనుమతి
- వివాదాస్పద పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- ప్రతీ కేంద్రం వద్ద మొదటి సారిగా క్లాక్ రూమ్‌లు
- కలెక్టర్లతో సీఎస్‌రామకృష్ణారావు వీడియోకాన్ఫరెన్స్
- ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 24: రాష్ట్రంలో జరగనున్న ఇంటర్మీడియట్, ఎస్ఎస్సి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రరీక్ష ప్రారంభం తర్వాత ఐదు నిమిషాల వరకు హాజరయ్యేందుకు అనుమతినిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య , పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ లు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుండి, పదవ తరగతి పరీక్షలు మార్చి 14 నుండి ప్రారంభమవుతున్నాయని, ఈ పరీక్షల నిర్వహణలో ఏవిధమైన అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ సారి పరీక్షలకు నిర్ణీత సమయానికన్నా ఐదు నిమిషాల తర్వాత కూడా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన

...:: మిగతా 2లో



బాలికలకు హెచ్ పీవీ వ్యాక్సిన్

మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ నివారణకు త్వరలో దేశవ్యాప్తంగా యుక్త వయసు బాలికలందరికీ హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్‌ను పంపిణీ చేయనున్నారు.

9



నోటాతో మార్పు వచ్చిందా?

- ఎన్నికైన నేతల క్వాలిటీ పెరిగిందా?
- సుప్రీంకోర్టు ధర్మాసనం సూటి ప్రశ్న
- నోటా గరిష్ఠ ఓట్లు తెచ్చుకున్నా సీటు భర్తీ కాదంటూ వ్యాఖ్య-
- ఓటింగ్‌ను తప్పనిసరి చేసే దిశగా ఆలోచించాలని సూచన
- ఒక్క అభ్యర్థి ఉన్నా నోటా అవకాశం ఇవ్వాలంటూ దాఖలైన పిల్ విచారణ

...:: 2లో



సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు

వెంటనే పూర్తి చేయాలి

- రాజకీయ అక్కసుతోనే పనుల్లో జాప్యం..
- దయనీయంగా ఎంజీఎం ఆస్పత్రి పరిస్థితి: మాజీ మంత్రి హరీశ్ రావు

...:: 6లో

ఎలాంటి నిబంధనలు లేకుండా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులివ్వాలి

...:: 2లో

పార్టీకి భారం కాలేకనే

ప్రజా జీవితంలోకి

- ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది
- ప్రస్తుతం రెండు కిడ్నీలు పాడైపోయాయి
- ఐదెకరాల భూమి, డబుల్‌బెడ్‌రూం ఇవ్వండి
- ప్రభుత్వం చేయూత నివ్వాలని విజ్ఞప్తి
- 'ప్రతిపక్షం'తో మావోయిస్టు బండి ప్రకాశ్ దంపతులు

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల

ఫిబ్రవరి 24: విద్యార్థి దశలో పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై అడవిబాట పట్టడం జరిగిందని, దీంతో తన కుటుంబం కూడ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొందని అనారోగ్యంతో అజ్ఞాతం నుంచి ఇటీవలే జనజీవన స్రవంతిలోకి వచ్చిన మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్ పేర్కొన్నారు. వయస్సు మీదపడంతో రోజు రోజుకూ ఆరోగ్యం క్షీణించిందని దీనితో పార్టీకి భారం కాలేక తెలంగాణ ప్రజా ప్రభుత్వం వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని ప్రజా జీవితంలోకి రావడం జరిగిందని తెలిపారు. అనారోగ్యంతో అజ్ఞాతం

...:: మిగతా 2లో





కేరళ.. ఇక 'కేరళమ్'

కేరళ రాష్ట్రం పేరును 'కేరళమ్'గా మార్చాలన్న ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి మండలి మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

9

రాష్ట్రీయం

ఆర్టీసీ 'మీ సేవ' మొబైల్ యాప్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 24: ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించడంలో భాగంగానే 'మీ టికెట్' సదుపాయాన్ని కల్పించామని పొన్నం ప్రభాకర్ అన్నారు. 'మీ సేవ' మొబైల్ యాప్ ద్వారా ఆర్టీసీ బస్సు టికెట్లు, పాసులు పొందే సౌకర్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. సచివాలయంలో మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ రవాణా శాఖ స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్, ఎండీ నాగిరెడ్డితో కలిసి ఈ నూతన సేవలను ఆవిష్కరించారు. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ నుంచి మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్ వరకు అన్ని సర్వీసుల్లోనూ ఈ యాప్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని చెప్పారు. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రయాణికులకు ఇబ్బందిలేని రవాణా సౌకర్యం కల్పించడమే తమ లక్ష్యమని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ ఆర్టీసీ ఈడీలు మునిశేఖర్, వెంకన్న, ఖుస్రో షా ఖాన్, రాజశేఖర్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, సీటీఎం శ్రీదేవి, సీఈ(ఐటి) శ్రీదేవి, హైదరాబాద్, రంగారెడ్డి ఆర్ఎంలు సుధాపరిమళ, శ్రీలత, అధికారులు పాల్గొన్నారు.

ఎలాంటి నిబంధనలు లేకుండా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులివ్వాలి

- **మాజీ మంత్రి హరీశ్ రావు**

ప్రతిపక్షం ప్రతినిధి, వరంగల్, ఫిబ్రవరి 24: కేసీఆర్ 100 కోట్లతో జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు బడ్జెట్లలో జర్నలిస్టుల కోసం ఒక్క రూపాయి అయినా కేటాయించిందా..? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులతోపాటు జర్నలిస్టులకు ఫ్రీ హెల్త్ స్కీమ్ తెచ్చిందని.. ఉద్యోగులకు 1% కంట్రిబ్యూషన్‌తో, జర్నలిస్టులకు పూర్తిగా ఉచితంగా సేవలు అందించాలని నిర్ణయించాం. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం జర్నలిస్టులను చూస్తేనే విసుక్కుంటోందని అన్నారు. మంగళవారం వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను హరీష్ రావు ఇతర బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. ఆసుపత్రి పనుల పురోగతిని పరిశీలించిన అనంతరం హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ 100 కోట్లతో జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు బడ్జెట్లలో జర్నలిస్టుల కోసం ఒక్క రూపాయి అయినా కేటాయించిందా..? అని ప్రశ్నించారు. రెండున్నరేళ్లలో ఒక్కరికైనా కొత్త అక్రిడిటేషన్ కార్డ్ ఇచ్చారా..? జర్నలిస్టులకు ఎలాంటి నిబంధనలు లేకుండా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలన్నారు హరీష్ రావు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసినట్లుగా జర్నలిస్టుల యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్‌కు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని.. లేదంటే ప్రమాదవశాత్తు జర్నలిస్టులు మరణిస్తే వాళ్ల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌కు సమానంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి

పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని , గతంలో ఉన్న వివాదాస్పద పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సాధించాలని అన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో కనీస సౌకర్యాలతో పాటు సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్షల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యా శాఖ అధికారులు కాకుండా ఇతర శాఖల అధికారులతో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ, ఈ సారి ఇంటర్ పరీక్షలకు 4,89,055 మంది ఫస్ట్ ఇయర్ కు 4,53,832 మంది విద్యార్థులు సెకండ్ ఇయర్ కు హాజరవుతున్నారని అదేవిధంగా 5,28,239 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్ లు ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్ లను అనుమతించడం లేదని కేవలం పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కు మాత్రమే ఎమర్జెన్సీ పరిస్థితులలో ఉపయోగించడానికి సెల్ ఫోన్ ను అనుమతిస్తున్నట్టు తెలిపారు. ప్రతీ కేంద్రం వద్ద మొదటి సారిగా క్లోక్ రూమ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏపరీక్షా కేంద్రంలో నైనా ఏవిధమైన అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారులు, సిబ్బంది పై కఠిన చర్యలు చేపట్టనున్నట్టు హెచ్చరించారు. ఈ సారి మొదటి సారిగా విద్యార్థుల హాల్ టికెట్లను వాట్సాప్ ద్వారా పంపడమే కాకుండా వెబ్ సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్లను ఆదేశించారు.

నోటాతో మార్పు వచ్చిందా?

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: "నోటా వచ్చిన తర్వాత ఎన్నికైన నాయకుల నాణ్యతలో నిజంగా మార్పు వచ్చిందా?" ఎన్నికల వ్యవస్థలో నోటా ఆప్షన్ నిజంగా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిందా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఒకే ఒక్క అభ్యర్థి ఉన్న సందర్భాల్లో కూడా ఓటర్లకు నోటా ఎంపిక కల్పించాలంటూ దాఖలైన పిల్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. చీఫ్ జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, జస్టిస్ జాయ్‌మాల్య బగ్చీతో కలిసి మంగళవారం లేవనెత్తింది. ఈ సందర్భంగా జస్టిస్ బగ్చీ మాట్లాడుతూ, నోటా వచ్చిన తర్వాత ఎన్నికైన నాయకుల నాణ్యతలో నిజంగా మార్పు వచ్చిందా? అని ప్రశ్నించారు. నోటా అత్యధిక ఓట్లు సాధించినా ఆ సీటును అది భర్తీ చేయలేదని, అందువల్ల నోటాను ఒక ప్రత్యామ్నాయ అభ్యర్థిలా పరిగణించలేమని అభిప్రాయపడ్డారు. కాగా, 1952 నుంచి ఇప్పటివరకు సుమారు 82 లక్షల మంది ఓటర్లు ఈ విధానంతో తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు. ఓటర్లకు నెగటివ్ ఓటు హక్కు రాజ్యాంగంలోని మాట స్వేచ్ఛ, వ్యక్తీకరణ హక్కులో భాగమని గత తీర్పులను కూడా పిటిషనర్లు ప్రస్తావించారు. ఇదిలా ఉండగా, అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి పిటిషన్‌కు వ్యతిరేకంగా వాదిస్తూ, "ఇది ఊహాజనిత అంశం. చట్టాన్ని ఇలా పరీక్షించలేం. ఓటు హక్కు రాజ్యాంగబద్ధమైనది" అని కోర్టుకు తెలిపారు. ధర్మాసనం మరో ముఖ్య సూచన చేస్తూ, మంచి అభ్యర్థులు గెలవాలంటే ఓటింగ్ శాతం పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొంది. చదువుకున్నవారు, ఆర్థికంగా స్థిరపడినవారు ఓటింగ్‌లో తక్కువగా పాల్గొంటుండగా, సాధారణ ప్రజలు, మహిళలు ఎక్కువగా ఓటు వేస్తున్న ధోరణిపై కూడా ఆవేదన వ్యక్తం చేసింది. అవసరమైతే ఓటింగ్‌ను తప్పనిసరి చేసే అంశంపై కూడా ఆలోచించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు, తదుపరి విచారణను మార్చి 17కు వాయిదా వేసింది.



కుమ్మెర ఘటనపై బీసీ కమిషన్ విచారణ

- **బాధిత కుటుంబీకులను పరామర్శించిన కమిషన్ చైర్మన్ జి. నిరంజన్**

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 24: తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జైప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామాన్ని సందర్శించారు. మల్లన్న జాతర సందర్భంగా వెనుకబడిన తరగతులకు చెందిన గణేష్, మోనికపై దాడి జరిగినట్లు, అనంతరం రెండు నెలల శిశువు మరణించిన ఘటనపై కమిషన్ చైర్మన్, సభ్యులు మీడియా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్ ఎస్పీతో కలిసి మల్లన్న జాతర జరిగిన ప్రదేశాన్ని సందర్శించి విచారణ జరిపారు. ఈ సందర్భంగా స్థానిక నిర్వాహకులు తమంతట తామే టికెట్లు ముద్రించి డబ్బులు వసూలు చేసినట్లు అసిస్టెంట్ ఎండోమెంట్ కమిషనర్ మదన్ తెలిపారు. జాతరకు ప్రవేశ రుసుము వసూలు విషయంలో బాధితులు, నిర్వాహకుల మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. సరైన ఏర్పాట్లు చేయడంలో జిల్లా పరిపాలన, పోలీస్ శాఖ మరియు ఎండోమెంట్స్ శాఖల నిర్లక్ష్యం ఉన్నట్లు కమిషన్‌సభ్యులు గుర్తించారు. కమిషన్ సభ్యులు బాధితులతో చర్చించి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. బాధితులను కలిసిన తరువాత కమిషన్ జిల్లా కలెక్టర్, ఎస్పీతో సమావేశమై ఈ అంశంపై చర్చించింది.

లొంగిపోయిన దేవ్ జీ

మొదటిపేజీ తరువాయి

వ్యవస్థలు పూర్తిగా కుప్పకూలాయని స్పష్టం చేశారు. సిద్ధాంతాల పట్ల అయోమయం, అంతర్గత విభేదాలు, క్షేత్రస్థాయి వాస్తవాల దృష్ట్యా వీరు హింసను వీడి బయటకు వచ్చారని ఆయన పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ పునరావాస పథకం కింద సుమారు 90 లక్షల రూపాయల రివార్డు మొత్తాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు, హింసను వీడి వచ్చే వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, లొంగిపోయిన నేతలకు తక్షణ ఆర్థిక సాయంతో పాటు, ఆరోగ్య సంరక్షణ , గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేందుకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని డీజీపీ హామీ ఇచ్చారు. అడవుల్లో ఇంకా మిగిలి ఉన్న వారు కూడా కాలం చెల్లిన సిద్ధాంతాలను పక్కన పెట్టి, సమాజ వికాసంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

అజ్ఞాతంలో 11 మంది క్యాడర్ మాత్రమే

రాష్ట్రంలో మావోయిస్టుల ఉనికి గురించి డీజీపీ కీలక సమాచారం అందించారు. ప్రస్తుతం తెలంగాణకు చెందిన కేవలం 11 మంది క్యాడర్ మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని, వారిలో మాజీ అగ్రనేత గణపతి కూడా ఉన్నారని తెలిపారు. అయితే ఈ 11 మందిలోనూ కేవలం ఒకరు లేదా ఇద్దరు మాత్రమే చురుగ్గా ఉన్నారని, మిగిలిన వారంతా ఉద్యమానికి దూరంగా లేదా ఇతర రాష్ట్రాల్లో తలదాచుకుంటున్నారని పేర్కొన్నారు. కాగా, లొంగిపోయిన నేతలు దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా అజ్ఞాతంలో గడిపారు. తిప్పిరి తిరుపతి 44 ఏళ్లుగా, మల్లా రాజిరెడ్డి 46 ఏళ్లుగా పోలీసులకు దొరకకుండా సాయుధ పోరాటంలో కొనసాగుతున్నారు. చొక్కారావు 28 ఏళ్లు, నర్సింహారెడ్డి 36 ఏళ్లుగా అడవుల్లోనే జీవించారు. ఆయుధాల తయారీలో దిట్టగా పేరున్న దేవ్ జీ, పార్టీ సైనిక విభాగానికి ఇన్‌ఛార్జ్‌గా పనిచేశారు.

జైలులో పెడితే భయపడం

మొదటిపేజీ తరువాయి

మండిపడ్డారు. 'రేవంత్ రెడ్డీ గుర్తుపెట్టుకో.. నువ్వు మళ్లీ చిప్పకూడు తినే సమయం కచ్చితంగా వస్తుంది' అని ముఖ్యమంత్రిని హెచ్చరించారు. కేటీఆర్ ఇంకా మాట్లాడుతూ.. 'కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయి, బీఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారు. కొన్ని మున్సిపాలిటీల్లో ప్రజాతీర్పును అపహాస్యం చేసేలా వ్యవహరించారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 22 చోట్లకుగానూ 14 స్థానాల్లో గెలుపుతో స్పష్టమైన మెజారిటీ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఏడు స్థానాల్లో మాత్రమే గెలిచినా అధికార దాహంతో ప్రజాతీర్పును అపహాస్యం చేసింది. సీఎం, స్థానిక మంత్రి సూచనలకు అనుగుణంగా అధికారులు వారికి తొత్తులుగా మారి ప్రజాతీర్పును ఎగతాళి చేశారు' అని మండిపడ్డారు. 'మరికొన్ని మున్సిపాలిటీలలోనూ ఇదే రీతిన వ్యవహరించారు. మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా ప్రవర్తించినా కనీసం మంత్రి స్పందించలేదు. దేశ చరిత్రలో ఇంత ఘోరమైన రాజకీయం లేదు. బాల్క సుమన్‌ను ఇక్కడ జైలులో ఉంచి వారి డ్యూటీకి ఆటంకం కలిగించారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పోలీసులను బూతులు తిట్టినా కేసు పెట్టలేదు. బీజేపీ ఎంపీ అరవింద్ పోలీసులను తిట్టినా కేసులు పెట్టలేదు. అధికార పార్టీ ప్రజాతీర్పును అపహాస్యం చేస్తుంటే.. ప్రశ్నించిన మా పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టారు. మూడు కోట్ల ఆఫర్ ఇచ్చినా మా కౌన్సిలర్లు లొంగలేదు. సీపీఐ కౌన్సిలర్లు సైతం నిబద్ధతతో ఉన్నారు. పొత్తుధర్మాన్ని పాటిస్తున్నారు' అని కేటీఆర్ చెప్పారు. 'బాల్క సుమన్‌ను జైలులో పెట్టారు. ఆయనకు జైలు కొత్త కాదు. ఆరు నెలలు వివిధ సందర్భాల్లో జైలులో ఉన్నారు. జైలులో పెడితే భయపడతారనుకుంటే పొరపాటే. రేవంత్ రెడ్డికి మళ్ళీ చిప్పకూడు తినే సమయం వస్తుంది. పోలీసులను బూతులు తిడితే కేసులు పెట్టని డీజీపీ బీఆర్ఎస్ నేతలపై మాత్రం కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. తిరిగి రాష్ట్రంలో గులాబి జెండా ఎగురుతుంది. ఏ కలుగులో దాక్కున్నా అరాచకాలు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు. రాజ్యాంగాన్ని, చట్టాలను తుంగలో తొక్కుతున్న వారిని వదలం. క్యాతన్ పల్లి, ఇబ్రహీం పట్నం, ఖానాపూర్‌లో వెంటనే ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం' అన్నారు. 'నిజాయితీగా ఎన్నిక జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. అధికారుల ముసుగులో అధికార పార్టీకి వత్తాసు పలికే వారిని వదలం. క్యాతన్‌పల్లిలో మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై సైతం కేసు పెట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అగౌరవపరుస్తున్నది. అధికార పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పే రోజు వస్తుంది. బాల్క సుమన్‌ను దగ్గరలో ఉన్న జైలులో పెట్టకుండా దూరంగా ఉన్న జైలులో పెట్టి.. దోమలు ఎక్కువగా ఉన్న గదిలో ఉంచి వేధిస్తున్నారు. వీటన్నింటిని గుర్తుపెట్టుకుంటాం' అని వార్నింగ్ ఇచ్చారు.

ఐటీ టవర్ పూర్తయితే వేలాది ఉద్యోగాలు

మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దూరదృష్టితో రాష్ట్రంలోని పది ప్రాంతాల్లో ఐటీ టవర్లు నిర్మించాలని నిర్ణయించారని కేటీఆర్ తెలిపారు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలోనూ సమాచార సాంకేతిక రంగ అభివృద్ధి జరగాలనే ఉద్దేశంతో, జోగు రామన్న అభ్యర్థన మేరకు జిల్లా కేంద్రంలో ఐటీ టవర్‌ను మంజూరు చేశామని చెప్పారు. ప్రస్తుతం మొదటి దశ పనులు కొనసాగుతున్నాయని, సుమారు 700 మంది యువతకు ఉపాధి కల్పించేలా టవర్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దూరదృష్టితో ప్రారంభించిన ఐటీ టవర్ ప్రాజెక్టుతో మొదటి దశలో వందలాది, రెండో దశలో వేలాది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదిలాబాద్‌లో పర్యటించిన కేటీఆర్ ఐటీ టవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు జోగు రామన్న, వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, పార్టీ నాయకులు జాన్సన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నిజామాబాద్‌లో నిర్మించిన ఐటీ టవర్‌లో ఇంకా ఉద్యోగ నియామకాలు పూర్తిగా జరగలేదని, ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్‌లోనూ వెంటనే నియామకాలు చేపట్టాలని కేటీఆర్‌ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీ విషయంపై మాట్లాడుతూ, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కర్మాగారాన్ని పునఃప్రారంభించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని అన్నారు. ఆదిలాబాద్ పర్యటన సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ, కర్మాగారం ప్రారంభంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఈ అంశంలో భారతీయ జనతా పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు చొరవ చూపాలని సూచించారు.

పార్టీకి భారం కాలేకనే ప్రజా జీవితంలోకి

మొదటిపేజీ తరువాయి

నుంచి ఇటీవలే జనజీవన స్రవంతిలోకి వచ్చిన ఆయన మంగళవారం ఆయన 'ప్రతిపక్షం'తో మాట్లాడారు. తనపై ఉన్నటువంటి రివార్డు 20 లక్షలు వచ్చిందని తెలిపారు. అనారోగ్యంతో రాష్ట డీజీపీ హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారని తెలిపారు. ప్రస్తుతం రెండు కిడ్నీలు పాడైపోయాయని తెలిపారు. ప్రభుత్వానికి తాను ఒక దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఐదెకరాల భూమితో పాటు ఉండడానికి డబుల్‌బెడ్‌రూం ఇల్లు కావాలని దరఖాస్తులో పేర్కొన్నట్లు తెలిపారు. రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝాను కలిశానని ఆయన బాగానే స్పందించారని తెలిపారు. ప్రస్తుతం తనకు ఉండేందుకు ఇల్లుతో పాటు ఆరోగ్యం క్షీణించిందని వైద్యం అందించాలని కోరడం జరిగిందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం తనకు చేయూతనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు ఆపరేషన్ కగార్ గురించి ఆయనను అడుగగా ప్రజలు చరిత్ర నిర్మాతలను సమాజాన్ని మార్చే శక్తి ప్రజలకే ఉంటుందని సమాధానం ఇచ్చారు. ఇతర అంశాలపై మాట్లాడడం నిరాకరించారు.

విద్యార్థి దశ నుంచే..

మందమర్రికి చెందిన బండి ప్రకాశ్ విద్యార్థి దశ నుంచే పీపుల్స్‌వార్ అనుబంధ విద్యార్థి సంఘం ఉద్యమాలకు ఆకర్షితుడై అజ్ఞాతంలోకి వెళ్లారు. నాలుగు దశాబ్దాలపాటు దండకారణ్యంలో పని చేశారు. పార్టీ సిద్ధాంతాలు ప్రజా ఉద్యమాలే లక్ష్యంగా అంకితభావంతో పని చేశారు. అనేక సార్లు ఎన్ కౌంటర్ల నుంచి తప్పించుకున్నారు. ఒక సారి అరెస్టయి ఆదిలాబాద్ నుంచి తప్పించుకొని బయటికి వెళ్లారు. దండకారణ్యంలో పని చేయడంతో పాటు జైలు జీవితాన్ని కూడా గడిపారు. ఇటీవల ఆపరేషన్ కగార్ నేపథ్యంలో పోలీసుల కూంబింగ్‌లు, ఎన్ కౌంటర్ల పరంపర కొనసాగుతుండగా అనారోగ్యంతో అజ్ఞాతం నుంచి ఇటీవలే జనజీవన స్రవంతిలోకి వచ్చారు. తెలంగాణ మావోయిస్టు పార్టీ రాష్ట కమిటీ సభ్యుడితో పాటు సింగరేణి కార్మికుల కోసం ఏర్పడినటువంటి సింగరేణి కార్మిక సమాఖ్య(సీకాసా) కోల్ బెల్ట్‌కార్యదర్శి ప్రభాత్ పేరిట కూడ పని చేశారు. సికాసా మద్దతుతో సింగరేణిలో జరిగిన అనేక సమ్మెలు విజయవంతమైన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఆయన మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో నివాసం ఉంటున్నారు.

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచాలి

- **నర్వ యాస్పరేషన్ బ్లాక్ లో విస్తృతంగా పర్యటించిన నీతి ఆయోగ్ డిప్యూటీ సెక్రటరీ, అడిషనల్ మిషన్ డైరెక్టర్ గౌరవ్ కటియార్**

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, ఫిబ్రవరి 24 : ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచే దిశగా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించాలని నీతి ఆయోగ్ డిప్యూటీ సెక్రటరీ/ అడిషనల్ మిషన్ డైరెక్టర్ గౌరవ్ కటియార్ సూచించారు. నారాయణపేట జిల్లాకు వచ్చిన ఆయన మంగళవారం జిల్లాలోని నర్వ యాస్పరేషన్ బ్లాక్ మండలంలోని పెద్ద కడుమూరు,రాయికోడ్, పాతర్ చేడ్, నర్వ గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణం, పశు వైద్య శిబిరాలు, ఆరోగ్య కేంద్రాల్లో వసతులు, మహిళల అభ్యున్నతికి చేపడుతున్న కార్యక్రమాలను ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ముందుగా పెద్ద కడుమూరు గ్రామానికి చేరుకున్న గౌరవ్ కటియార్ పీఎం శ్రీ జెడ్పీ ఉన్నత, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులు చేస్తున్న యోగా ఆసనాలను తిలకించారు. అనంతరం మండలంలోని రాయికోడ్ గ్రామానికి చేరుకున్న గౌరవ్ కటియార్ అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలో పిల్లల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, నీతి అయోగ్ రాష్ట్ర సమన్వయకర్త లోకేష్ తో కలిసి గ్రామానికి చెందిన గర్భిణీలకు చీర,గాజులు, పసుపు కుంకుమ పెట్టీ శ్రీమంతం చేసి, చిన్నారులకు




అన్న ప్రాసన అక్షరాభ్యాసం చేయించారు. గ్రామానికి చెందిన ఫాతిమా బేగం నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇంటిని ఆయన పరిశీలించారు అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మొగులప్ప, డీడబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, సిడిపివో సరోజ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి

- **జర్నలిస్టులకోసం మరో ఉద్యమం చేస్తాం**
- **మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ**



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో,హైదరాబాద్, ఫిబ్రవరి 24: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు క్యాష్‌లెస్ హెల్త్ కార్డు అమలు చేయాలని మీడియా అకాడమీ మాజీ చైర్మన్, టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో జర్నలిస్టులు పోరాడి సాధించుకున్న హెల్త్ కార్డును, ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో మంగళవారం టీయూడబ్ల్యూజే ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్యమంత్రి కాక ముందే, ఉద్యమ సమయంలో జర్నలిస్టులకు ఇచ్చిన మాట ప్రకారం, ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఉద్యోగులతో సమానంగా హెల్త్ కార్డును నాలుగు సంవత్సరాల పాటు అన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ లో చెల్లు బాటు అయ్యేలా అమలు చేశారని అల్లం నారాయణ చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం హాయంలో జర్నలిస్టులకు ఇచ్చిన క్యాష్ లెస్ హెల్త్ కార్డు వల్ల జర్నలిస్టులకు కోట్లాది రూపాయల వైద్య సహాయం అందిందని ఆయన గుర్తు చేశారు. అదే కార్డు ఇప్పటి వరకు నిమ్స్ వంటి హాస్పిటల్స్ లో చెల్లుతుందని అన్నారు. నిన్న కేబినెట్ మీటింగ్ అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనలో ఉద్యోగులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డు స్కీమ్ లో జర్నలిస్టుల విషయం లేక పోవడం అత్యంత బాధాకరం అని అల్లం నారాయణ అన్నారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జర్నలిస్టులకు గత ప్రభుత్వం కంటే మెరుగైన విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అయిపోయినా జర్నలిస్టులకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదని ఆయన అన్నారు. కొత్తగా ఏమీ ఇవ్వకపోగా, ఉన్న అక్రెడిటేషన్ కార్డులలో కోత విధించడం, ఉన్న హెల్త్ కార్డును కూడా తీసివేయడం అత్యంత శోచనీయం అని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అమలు చేయకపోతే ఈ రాష్ట్ర ప్రభుత్వానికి జర్నలిస్టుల ఉద్యమం ఎలా ఉంటుందో చూపిస్తామని అల్లం నారాయణ హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీ సాగర్, తెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర కోశాధికారి పి.యోగనంద్, హైదరాబాద్ నగర ఇంచార్జ్ యార నవీన్ కుమార్, టీయూ డబ్ల్యూ జే నగర కోశాధికారి బాపు రావు, కేబుల్ చానెల్స్ జర్నలిస్టుల జేఏసీ నేత కడకంచి వెంకటేష్, టీయూ డబ్ల్యూ జే నేత లాయక్ పాషా తదితరులు పాల్గొన్నారు.



మలయాళంలో ఇప్పటికే కేరళను కేరళం అనే పిలుస్తారు. ఇప్పుడు ఆ పదాన్ని ఇంగ్లీషులోకి తీసుకురావడం వల్ల ఒరిగేదేమీ లేదు. పేరు మార్పుపై చూపిస్తున్న శ్రద్ధను రాష్ట్ర అభివృద్ధిపై చూపడం లేదు. బడ్జెట్‌లో కేరళకు ఒక్క కొత్త ప్రాజెక్టూ ఇవ్వలేదు. ఎయిమ్స్ వంటి కీలక సంస్థలను కేటాయించలేదు.

- ఎంపీ శశి థరూర్

అభివృద్ధికి చిహ్నంగా నైపుణ్యాభివృద్ధి శాఖ

- ఐటీఐలను అడ్వాన్స్‌డ్‌స్కిల్ సెంటర్లుగా మారుస్తున్నాం
- కార్మిక శాఖా మంత్రి వెంకటస్వామి



ప్రతిపక్షంస్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 24: తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి ఒక శాఖ అభివృద్ధి చిహ్నంగా మారిందని కార్మిక శాఖా మంత్రి డా. జీ వివేక్ వెంకటస్వామి అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఐటీఐలు, శిక్షణా మౌలిక వసతులను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్డ్ స్కిల్ సెంటర్లు గా మారుస్తున్నామని చెప్పారు. ఆధునిక యంత్రాలు, డిజిటల్ పరికరాలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన పాఠ్య ప్రణాళికలను అమలు చేస్తున్నామని వివరించారు. కన్హా శాంతి వనంలో నిర్వహించిన ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ 2025-26 దక్షిణ ప్రాంత పోటీల ముగింపు కార్యక్రమానికి రాష్ట్రకార్మిక మరియు ఉపాధి శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంప్లాయ్మెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ క్రాంతి వేస్లీ, ఐఏఎస్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. సౌత్ ఇండియా స్థాయి పోటీలలో మొత్తం 63 నైపుణ్య విభాగాల్లో 350కి పైగా పోటీదారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్యంగా 123 మంది యువతులు పాల్గొనడం ప్రోత్సాహకరంగా నిలిచింది. సంప్రదాయంగా పురుషాధిక్యంగా భావించే కేబినెట్ మేకింగ్, కార్పెంట్రీ, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్స్, ప్లంబింగ్, హీటింగ్ వంటి రంగాల్లో 20 మంది మహిళలు పోటీ చేయడం సామాజిక మార్పుకు నిదర్శనంగా నిలిచింది. 3డి డిజిటల్, అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆటోనమస్ మొబైల్ రోబోటిక్, బ్యూటీ థెరపీ, బ్రిక్ లేయింగ్, కేబినెట్ మేకింగ్, కార్పెంట్రీ తదితర విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు మంత్రి గారు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జి. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, "ఈ రోజు కేవలం సర్టిఫికెట్ల గురించినది కాదు. ఇది కృషి, క్రమశిక్షణ, అంకితభావం మరియు ప్రతిభను గౌరవించే రోజు. ఇక్కడ ఉన్న యువతను చూసినప్పుడు దేశ భవిష్యత్తుపై అపారమైన విశ్వాసం కలుగుతోంది" అన్నారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ విద్యాసంస్థలు మరియు పరిశ్రమల మధ్య వారధిగా కీలక పాత్ర పోషిస్తోందని, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్య పరిష్కరణ సామర్థ్యం, డిజిటల్ లిటరసీ వంటి అంశాలను శిక్షణలో భాగం చేశామని మంత్రి తెలిపారు.

అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ

- త్వరలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'
- తెలంగాణ సమగ్రాభివృద్ధికే 'క్యూర్ - ప్యూర్ - రేర్'
- "గ్రోత్ ఎక్స్ 2026" సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 24: తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాలనే లక్ష్యంతో త్వరలోనే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'కు శ్రీకారం చుట్టబోతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని మరింత పరుగులు పెట్టించేలా, పెట్టుబడిదారులకు పూర్తిస్థాయిలో భరోసా కల్పించేలా, ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా అందరితో చర్చించి ఈ కొత్త విధానాన్ని రూపొందిస్తామన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ లో ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన "గ్రోత్ ఎక్స్ 2026 " సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. గ్రోత్ అంటే యాదృచ్ఛికంగా వచ్చేది కాదని, భావి తరాల భవిష్యత్తు కోసం శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ విజన్ 2047" ను రూపొందించిందన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న తెలంగాణను, 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధనకు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి "క్యూర్ ప్యూర్ రేర్" అనే త్రిముఖ వ్యూహానికి శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నామన్నారు. నగరం నుంచి గ్రామం వరకు ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే తమ అజెండా అని స్పష్టం చేశారు. ఏఐ, ఇండస్ట్రీ 5.0 లాంటి టెక్నాలజీస్ తో వర్క్ కల్చర్ లో మార్పు వచ్చిందని, రాబోయే రోజుల్లో కంపెనీల కంటే "ఎకో సిస్టం"కే ప్రాధాన్యత ఉంటుందన్నారు. అందుకే... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా దానినే నిర్మించాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. పరిశ్రమలకు కేవలం అనుమతులు ఇచ్చే వ్యవస్థలా కాకుండా, వారితో కలిసి నడిచే భాగస్వామిగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ప్రముఖ వైద్యులు డా.నాగేశ్వర్ రెడ్డి , ఫ్యాప్సీ ప్రెసిడెంట్ ఆర్.రవి కుమార్, స్కై రూట్ ఏరో స్పేస్ ప్రతినిధి పవన్, గ్రోత్ ఎక్స్ 2026కన్వీనర్ పంకజ్ దివాన్ తదితరులు పాల్గొన్నారు.



కోఠి కాల్పుల ఘటన.. ఇద్దరి అరెస్టు

ప్రతిపక్షం, సిటీబ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 24: కోఠి ఎస్‌బీఐ ఏటీఎం వద్ద తుపాకీతో కాల్పులు జరిపి రూ. 6లక్షల నగదు దోచుకున్న అంతర్ రాష్ట్రముఠాను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ , సుల్తాన్‌బబజార్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఈకేసుకు సంబంధించిన వివరాలను సిటీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ బషీర్‌బాగ్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి, ఏసీపీ మత్తయ్యలతో కలిసి వెల్లడించారు. పోలీసులు అరెస్ట్‌చేసినవారిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన పుర్కాన్ అహ్మద్, హైదరాబాద్‌లో నివసిస్తున్న మహ్మద్ తయబ్ త్యాగి ఉన్నారు. వీరి నుంచి ఒక నాటు తుపాకీ, 35 లైవ్ తూటాలు, 2 మ్యాగజైన్లు, రూ .2.38లక్షలు నగదు , 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఫహీమ్ అహ్మద్, నౌషాద్, అబిద్, డానిష్‌త్యాగి, మహ్మద్ మత్లూబ్ అనే మరో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారు.



కాంగ్రెస్ అంటేనే పేదవాడి ప్రభుత్వం

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

ప్రతిపక్షం, పరిగి, ఫిబ్రవరి 24: "కాంగ్రెస్ అంటేనే పేదవాడి ప్రభుత్వం" అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేసిన పార్టీగా కాంగ్రెస్ చరిత్ర నిలిచిందన్నారు. పూడూరు మండలం మీర్జాపూర్ గ్రామంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి సోమవారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... దేశంలో పింఛన్ల వ్యవస్థను ప్రారంభించి, సామాజిక భద్రతకు పునాది వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. పేద కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించాలనే ఉద్దేశంతో సంవత్సరానికి వంద రోజుల ఉపాధి హామీ కల్పించే పథకాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాల అమలుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలకు ఎదురవుతున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మీర్జాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులు, లబ్ధిదారులను అడిగి తెలుసుకుని, నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మరో 7 మండలాలకు 'సమగ్ర జీవనోపాధి' విస్తరణ

- అత్యంత పేదరిక నిర్మూలన దిశగా కీలక అడుగు
- రాష్ట్ర మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 24 : తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సమగ్ర జీవనోపాధి కార్యక్రమాన్ని మరో 7 మండలాలకు విస్తరించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం రాష్ట్రంలో అత్యంత పేదరిక నిర్మూలన దిశగా కీలక అడుగుగా పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాల లోని ఆగా ఖాన్ ఫౌండేషన్ లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలు, తెగలు, అత్యంత వెనుకబడిన ఆదివాసి గిరిజన వర్గాలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ఈ జీవనోపాదుల కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని విస్తరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల, పినపాక, దుమ్ముగూడెం, చర్ల మండలాలు, మహబూబాబాద్ జిల్లా గంగారం, ఆదిలాబాద్ జిల్లా నార్నూర్, జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలాల్లో ఈ పథకం అమలు చేయనున్నారు. తెలంగాణలో గుర్తించిన పీవీటీజీలలో గోండ్, కొలం, తోటీ, చెంచు సముదాయాలు ఉన్నాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ ఆధ్వర్యంలో అమలు చేస్తూ, ఆగా ఖాన్ ఫౌండేషన్, బ్రాక్ ఇంటర్నేషనల్ సహకారంతో ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన "గ్రాడ్యుయేషన్ అప్రోచ్" విధానాన్ని అనుసరిస్తూ, స్థానిక వనరులు, సామాజిక అవసరాలకు అనుగుణంగా జీవనోపాధి అవకాశాలను సృష్టిస్తుందని మంత్రి వివరించారు.

ఇప్ప పువ్వు ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం

ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్ప పువ్వు ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఇటీవల జరిగిన మేడారం సమ్మక్కసారలమ్మ జాతరలో ఈ ఉత్పత్తులకు విశేష ఆదరణ లభించిందని మంత్రి తెలిపారు. స్థానిక వనరులను మార్కెట్‌తో అనుసంధానం చేయడం ద్వారా ఆదివాసి గిరిజన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా ఐదు జిల్లాల్లో ఎనిమిది మండలాల్లో సుమారు 6,000 అత్యంత పేద కుటుంబాలను లక్ష్యంగా పెట్టుకుని అమలు చేస్తున్నామని, ఇప్పటివరకు 3,554 కుటుంబాలు లబ్ధి పొందాయని తెలిపారు. త్వరలోనే మరో 8,000 కుటుంబాలను సమవేశి ఆజీవిక యోజన (SAY) ద్వారా జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద ఆర్థిక సహాయం అందజేసి ఆదాయ వృద్ధి కార్యక్రమాలకు అనుసంధానిస్తామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మాజీ అదనపు కార్యదర్శి చరణ్జీత్ సింగ్, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ సీఈఓ దివ్య దేవరాజన్, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ మోనిక ఛుటుంగురు, బ్రాక్ ఇంటర్నేషనల్ ఇండియా హెడ్ శ్వేతా ఎస్ బెనర్జీ తదితరులు హాజరయ్యారు.





కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే నెల 5న హైదరాబాద్ లో జరగనున్న తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. అలాగే కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ని కూడా మర్యాదపూర్వకంగా కలిసి, తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.

- ప్రతిపక్షం, హైదరాబాద్



వేసవిలో నీటి కొరత ఉండొద్దు

- మిషన్ భగీరథ ద్వారా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టండి
- సర్పంచ్‌లతో కలిసి పని చేయండి
- మిషన్ భగీరథ సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 24: గ్రామీణ ప్రజలకు నిరంతర, నాణ్యమైన తాగునీటి సరఫరా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వేసవిలో తాగునీటి కొరత ఉండొద్దని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఉన్న మిషన్ భగీరథ కార్యాలయంలో గ్రామీణ తాగునీటి సరఫరా, వేసవి సన్నద్ధతపై మంగళవారం నిర్వహించిన సమగ్ర సమీక్ష సమావేశంలో ఆమె అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, సీఎఈలు, ఎస్ఈలు పాల్గొన్నారు. సమీక్షలో భాగంగా మిషన్ భగీరథ సోర్స్ పాయింట్లు, రిజర్వాయర్లలో నీటి లభ్యత, పంపింగ్ వ్యవస్థ, గ్రామాలవారీగా సరఫరా పరిస్థితులపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో తగినంత నీరు నిల్వలో ఉందని, వేసవిలోనూ పెద్ద ఇబ్బందులు ఉండవని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 24 వేల ఆవాసాల్లో కేవలం 150 ఆవాసాలకు మాత్రమే మిషన్ భగీరథ నీరు అందడం లేదని, ఇటీవల కొత్తగా 397 ఆవాసాలు ఏర్పాటయ్యాయని అధికారులు తెలిపారు. కొండలపై, అటవీ ప్రాంతాల్లో పైప్‌లైన్ వేయడం సవాల్‌గా ఉన్న చోట్ల స్థానిక జల వనరులను వినియోగించి ప్రత్యామ్నాయ పద్ధతుల్లో నిరంతర తాగునీటి సరఫరా కల్పించాలని మంత్రి ఆదేశించారు. వేసవి దృష్ట్యా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని సూచించారు. సర్పంచ్‌ల ఫోన్ కాల్స్‌కు తక్షణ స్పందన ఇవ్వాలని, సమస్యలు వచ్చిన వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. అలాగే గ్రామాల వారీగా తాగునీటి అవసరాలు, సరఫరా పరిస్థితులపై సర్పంచ్‌లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించాలని మంత్రి సూచించారు. గ్రామీణ తాగునీటి సరఫరా కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు మంజూరు చేయలేదని, రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తూ ప్రజల అవసరాలు తీర్చుతోందని చెప్పారు. ఈ రంగానికి తగిన నిధులు విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సమ్మక్క-సారలమ్మ మహా మేడారం జాతర సందర్భంగా ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా సమర్థవంతంగా పనిచేసిన మిషన్ భగీరథ ఇంజనీరింగ్ సిబ్బందిని మంత్రి సీతక్క అభినందించారు. వారికి శాలువాలు కప్పి, మోమెంటోలు అందజేసి సత్కరించారు. మహా జాతరలో లక్షలాది భక్తులకు అంతరాయం లేకుండా తాగునీరు అందించినందుకు ప్రత్యేకంగా ప్రశంసించారు.



కుల దురహంకారం ఇంకా ఎన్నాళ్లు?

- నాగర్ కర్నూల్ ఘటనపై ఆగ్రహించిన ప్రజా సంఘాలు
- హుస్నాబాద్ లో నిరసన, కొవ్వొత్తుల నివాళి

ప్రతిపక్షం, హుస్నాబాద్, ఫిబ్రవరి 24: బడుగు బలహీన వర్గాల మీద అగ్రవర్ణాల పెత్తనం, అహంకారం ఇంకా ఎన్నినాళ్లు కొనసాగిస్తారని పలువురు సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మెర మల్లన్న జాతరలో రజక కుటుంబంపై అగ్రవర్ణ దుండగులు జరిపిన దాడిలో మృతి చెందిన దుర్ఘటనను ఖండిస్తూ మంగళవారం నాడు హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో దళిత, బహుజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మృతిచెందిన చిన్నారి మౌనిక కోసం కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గాదెపాక రవీందర్ మాట్లాడుతూ తరతరాలుగా యుగయుగాలుగా దళిత బహుజనుల మీద అగ్రవర్ణాలు, పెత్తందారులు దాడులు చేస్తూనే ఉన్నారని అన్నారు. పుట్టు బానిసలుగా మార్చి వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రసాదించిన రాజ్యాంగం ద్వారా హక్కుల పొందాలని ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారని అన్నారు. ఈ రోజుల్లో కూడా ఇలాంటి దాడులు జరగడం సభ్య సమాజంలో తలవంపులేనని అన్నారు. స్వాతంత్రం సిద్ధించినా బడుగుల జీవితాలు ఇంకా అంధకారంలోనే మాకు పోతున్నాయని తెలిపారు. కొమ్మెర జాతరలో రజక కుటుంబాలను హింసించిన వారిని వెంటనే చట్టపరంగా శిక్షించాలని, బాధిత కుటుంబాలకు 1కోటి ఎక్స్గ్రేషియా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముక్కెర సంపత్ కుమార్, మేకల వీరన్న యాదవ్, కొయ్యడ కొమురయ్య, ఎలగందుల శంకర్, బత్తుల శంకర్ బాబు, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, బోయిని సదన్ కుమార్, లావుడ్యా వీరన్న నాయక్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, చంచల ఎల్లయ్య, కోతి యాదగిరి, కొలుగూరు అశోక్, కోడూరి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు



పేదలకు ఇళ్ల పేరిట గత వైసీపీ ప్రభుత్వంలో ₹6,000 కోట్లు స్వాహా చేశారు. 22 లక్షల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తే 7 లక్షల మంది ఆస్తిహక్కు పత్రాలు తీసుకోలేదు. చెరువులు, ముంపు ప్రాంతాల్లో స్థలాలివ్వడంతో 2.5 లక్షల మంది అసలు పట్టాలే తీసుకోలేదు. తీసుకున్న వారిలో 43,948 మంది అనర్హులున్నారు. మరో 1,11,037 పట్టాలను పరిశీలిస్తున్నాం

- ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రతిపక్షం
Prathipaksham.in
4
హైదరాబాద్
బుధవారం
25.02.2026
@prathipaksham
prathipakshamtvtelugu

హౌ ఇండియా గివ్స్!

దేశంలో దాతృత్వ కథలు సంపన్నులతో మొదలవుతాయి. ఆ తరువాతే సామాన్యుల వంతు.సంపన్నుల్లో కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత బడ్జెట్లు, బిలియనీర్లు ఇచ్చే కోట్ల రూపాయల వంటి ఆకర్షణీయ అంశాలు చాలా ఉన్నాయి. కానీ భారత్‌లో సామాన్యులు చేసే దానధర్మాలే ఎక్కువని ఓ నివేదిక చెబుతోంది.సంస్థాగత పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలు దాతృత్వంలో పెద్ద పాత్ర పోషిస్తున్నాయనే సంప్రదాయ వాదనను 'హౌ ఇండియా గివ్స్ 2025 నివేదిక' సవాలు చేస్తోంది. దీన్ని అశోకా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అండ్ ఫిలాంత్రఫీ రూపొందించింది. దాతృత్వంలో పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల కంటే ఎక్కువగా సాధారణ, మధ్య తరగతి వర్గం పెద్ద పాత్ర పోషిస్తున్నట్లు ఈ నివేదిక చెబుతోంది. భారత్‌లో గృహస్తులు ఏటా నగదుతో పాటు దుస్తులు, ఇతరత్రా వస్తువుల రూపంలో దాదాపు '54వేల కోట్ల రూపాయలు' స్వచ్ఛందంగా ఇస్తున్నారని ఈ నివేదిక అంచనా వేసింది. వారిలో 68 శాతం మంది ఏదో ఒక రూపంలో దానం చేస్తున్నట్లు నివేదిక తెలిపింది. ఇందులో 48 శాతం మంది ఆహారం, దుస్తులు లేదా ఇంట్లో వాడి పడేసిన వస్తువులు, 44 శాతం మంది నగదుగానూ, 30 శాతంమంది లాభాపేక్షలేని, మతపరమైన సంస్థలతో కలిసి అందించే స్వచ్ఛంద సేవ రూపంలో ఉంది.అన్నదానం కోసం ఇచ్చే విరాళాల్లో ఎక్కువ శాతం మతపరమైన ఉచిత అన్నదాన పథకాలకు వెళుతోంది. అలాగే ఈ సంస్థలు ప్రకృతివిపత్తులవేళ అందించే సాయంతోపాటు ఇతర పనులలోనూ స్వచ్ఛందంగా పాల్గొంటున్నాయి."భారత్ ప్రజల్లో దాతృత్వగుణం ఎక్కువ. సంపన్నుల కంటే సాధారణ ప్రజలు విరాళాలు ఇవ్వడంలో, దాన ధర్మాలు చేయడంలో పెద్ద పాత్ర పోషిస్తున్నారని మా పరిశోధనలో తేలింది. దాతృత్వం దేశ ప్రజల్లో సాంస్కృతికంగా, విస్తృతంగా ఇమిడి పోయింది" అని అశోకా యూనివర్సిటీలో సెంటర్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అండ్ ఫిలాంత్రఫీ హెడ్ జిన్నీ ఉప్పల్ చెప్పారు. భారతీయుల్లో ఉదారత్వం కేవలం సంపన్నుల్లోనే కాదు, మత విశ్వాసాలను పాటించే సమూహాలు, ప్రత్యక్షంగా అడిగే సాయాలు, ఆదాయంతో సంబంధం లేకుండా సాధారణ ప్రజలు చేసే దానాలతో ఇది ముడిపడి ఉంది.భారత్‌లోని 20 రాష్ట్రాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 7 వేల మంది అభిప్రాయాలు సేకరించి ఈ నివేదిక రూపొందించారు.ఈ విశ్లేషణ నేషనల్ శాంపిల్ సర్వే మీద ఆధారపడి ఉంది. ఈ సర్వే 'రోజువారీ దానాల'ను పరిశీలించింది. బిచ్చగాళ్లకు సాయం చేయడం, కుటుంబం లేదా స్నేహితులకు వ్యక్తిగతంగా సాయపడటం, సంస్థాగత, మతేతర సంస్థలకు విరాళాలు ఇవ్వడం లాంటివి ఇందులో ఉన్నాయి. సామీప్యత, విశ్వాసం అధారంగానే చాలా మంది దానాలు చేస్తున్నట్లు సర్వే గుర్తించింది.విరాళాలు ఇచ్చే వారిలో దాదాపు 40 నుంచి 45 శాతం మంది ప్రజలు మతపరమైన సంస్థలకు ఇస్తున్నారు. ఇందులో ఎక్కువ వాటా పట్టణ ప్రాంతాల్లోని బిచ్చగాళ్లు, నిరాశ్రయులకు వెళుతోంది.గ్రామీణ ప్రాంతాల్లో మతపరమైన సంస్థలకు ఎక్కువ విరాళాలు అందుతున్నాయి."దానం చేయడానికి మిమ్మల్ని ప్రేరేపిస్తున్నది ఏంటని మేము అడిగినప్పుడు మతపరమైన విశ్వాసమే తమకు ప్రేరణ అని 90శాతం మందికి పైగా చెప్పారు" అని అశోకా యూనివర్సిటీలో సెంటర్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అండ్ ఫిలాంత్రఫీ పరిశోధన అధిపతి క్రిషాను చక్రవర్తి చెప్పారు. నెలకు రూ.4వేల నుంచి రూ.5వేలు సంపాదించే వారిలోనూ సగం మంది దానం చేస్తున్నారు. వారి సంపాదన పెరిగే కొద్దీ దానాలు చేసే వారి సంఖ్య కూడా పెరుగుతోంది.ఇందులో లింగపరమైన అంశాలు చిన్నవే అయినా స్పష్టంగా ఉన్నాయి. మగాళ్ల పెత్తనం ఉన్న ఇళ్లలో కాస్త ఎక్కువగా మతపరమైన దానాలు చేస్తుంటే, మహిళల పెత్తనం ఉన్న ఇళ్లలో నిరుపేదలకు దానం చేయడం ఎక్కువగా ఉంది."ఈ సర్వేలో కీలకమైన అంశం ఏంటంటే భారతీయుల్లో రోజువారీ దానాలు చేయడం అనేది అప్పుడప్పుడు కాకుండా క్రమబద్ధంగా ఉంది" అని ఉప్పల్ చెప్పారు."ఇది ఆదాయం, వయసు, లింగం, గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా అన్ని చోట్లా, అందరిలోనూ ఉంది. దైనందిన సామాజిక జీవితంలో కనిపిస్తూనే ఉంటుంది" అన్నారు.మరో ముఖ్య విషయం ఏంటంటే, భారత్‌లో మొత్తం దానధర్మాల్లో రోజూ దానం చేసే వారి వాటా 15శాతం వరకు ఉంటుందని అంచనాలు సూచిస్తున్నాయి.పది హేను శాతమే అయినప్పటికీ వ్యవస్థీకృత సామాజిక రంగానికి అందుతున్న ప్రైవేట్ డొనేషన్లలో మూడోవంతుగా ఉంది."రోజూ దానం చేసే వాళ్లు ఇచ్చేది కొద్ది మొత్తమే అయినా, సామాజికంగా ప్రభావం చూపడంలో ప్రజల భాగస్వామ్యాన్ని సూచిస్తోంది" అని ఉప్పల్ చెప్పారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
బుధవారం
25.02.2026

విద్యా రంగం: వ్యాపారం, వంచన, బాధ్యతల సంక్షోభం

విద్యార్థులు కేవలం ఫీజులు చెల్లించే కస్టమర్లు కాదు; వారు దేశ భవిష్యత్తు. విద్యా రంగంలో అక్రమాలు కేవలం ఆర్థిక నష్టం కాదు; అవి నైతిక నష్టం. ఒక తరాన్ని తప్పుదోవ పట్టించే ప్రమాదం. కాబట్టి, కఠిన చట్టాలు, పారదర్శక అమలు, సామాజిక ఒత్తిడి—ఈ మూడు కలిసే మార్పు తీసుకురాగలవు. విద్యా సంస్థలు గుర్తింపు కోసం నాటకాలకన్నా, నాణ్యత కోసం కృషి చేస్తేనే భారతదేశం జ్ఞాన శక్తిగా ఎదగగలదు. లేకపోతే ర్యాంకులు పెరిగినా, విలువలు తగ్గిపోతాయి. జ్ఞానం ఆలయం వ్యాపార కాంప్లెక్స్‌గా మారితే, సమాజం మొత్తం మూల్యం చెల్లించాల్సిందే.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496

భారతదేశంలో విద్యా రంగం ఒకప్పుడు జ్ఞాన సాధనకు ఆలయం అయితే, ఈరోజు అది భారీ వ్యాపారంగా మారిందనే విమర్శ పెరుగుతోంది. ముఖ్యంగా ప్రైవేట్ యూనివర్సిటీలు, కార్పొరేట్ కాలేజీలు, కోచింగ్ సెంటర్లు గుర్తింపు, ర్యాంకులు, నిధుల కోసం అనుసరిస్తున్న మార్గాలు సమాజంలో ఆందోళన కలిగిస్తున్నాయి. జ్ఞానం బోధించాల్సిన సంస్థలు మార్కెటింగ్ యుక్తులు, బోగస్ అర్హతలు, తప్పుడు ప్రకటనలు, మానవత్వం లేని హాస్టల్ పరిస్థితులతో వార్తల్లో నిలవడం విద్యా వ్యవస్థలోని లోపాలను బహిర్గతం చేస్తోంది. ఇటీవలి కాలంలో ఢిల్లీలో ఒక ప్రైవేట్ విశ్వవిద్యాలయం చైనా తయారీ రోబోటిక్ డాగ్‌తో చేసిన ప్రదర్శన విఫలమై సోషల్ మీడియాలో ఎగతాళి పాలైంది. అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందాలని చేసిన ఆ ప్రయత్నం ప్రతికూల ప్రచారానికి దారితీసింది.భారత దేశ ప్రతిష్టకు మచ్చ తెచ్చేలా ఆ ప్రయివేటు యూనివర్సిటీ చేసింది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలా తమ విద్యా సంస్థలు గుర్తింపు కోసం విద్యా సంస్థలు చేసే 'షోపీసు' కార్యక్రమాలు అసలు బోధన నాణ్యతను పెంచవు. కాగా అవి తాత్కాలిక ప్రచారం మాత్రమే ఇస్తాయి.అంతర్జాతీయంగా దేశానికి చెడ్డ పేరు వస్తుంది. అంతేకాదు, నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (ఎన్.ఏ.ఏ.సీ.) ర్యాంకులు, నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్.ఐ.ఆర్.ఎఫ్) స్థానాల కోసం కొన్ని విశ్వవిద్యాలయాలు తప్పుడు డేటా సమర్పించాయనే ఆరోపణలు గతంలో వెలుగుచూశాయి. కొందరు కళాశాలలు ఫ్యాకల్టీ సంఖ్యను పెంచి చూపించడం, తాత్కాలికంగా సదుపాయాలు ఏర్పాటు చేసి తనిఖీ బృందం వెళ్లిన తర్వాత వాటిని తొలగించడం వంటి ఘటనలు మీడియా ద్వారా బయటపడ్డాయి. కొన్ని రాష్ట్రాల్లో ఒకే ప్రొఫెసర్ పేరు రెండు మూడు కాలేజీల్లో పూర్తి సమయ ఫ్యాకల్టీగా నమోదు చేసిన ఉదంతాలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఇది కేవలం నియామక వ్యవస్థలో లోపం కాదు; ఇది మోసం. ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్, మెడికల్ ప్రవేశాల కోచింగ్ రంగంలో పోటీ మరింత తీవ్రంగా ఉంది. ఒక విద్యార్థి జేఈఈ లేదా నీట్ వంటి పరీక్షల్లో మంచి ర్యాంక్ సాధిస్తే, ఆ విద్యార్థి ఫోటోను అనేక కోచింగ్ సెంటర్లు తమదిగా ప్రచారం చేస్తాయి. కొన్నిసార్లు విద్యార్థి ఒక్కచోట చదివినా, మూడు నాలుగు సంస్థలు తమ హోర్డింగుల్లో అతని ఫోటోను ఉపయోగించిన ఉదాహరణలు ఉన్నాయి. ఇటువంటి తప్పుడు ప్రకటనలపై వినియోగదారుల హక్కుల చట్టం కింద చర్యలు తీసుకోవచ్చని న్యాయ నిపుణులు చెబుతున్నా, అమలు స్థాయిలో కఠినత్వం కనిపించదు. ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల్లో బోగస్ ఫ్యాకల్టీ అర్హతల ఆరోపణలు మరింత తీవ్రమైనవి. మెడికల్ కౌన్సిల్ తనిఖీల సమయంలో ఇతర కాలేజీల నుంచి తాత్కాలికంగా ప్రొఫెసర్లను తీసుకొచ్చి



చూపించడం, ఫ్యాకల్టీ జాబితాల్లో తప్పుడు వివరాలు ఇవ్వడం వంటి ఘటనలు గతంలో విచారణల్లో బయటపడ్డాయి. విద్యార్థుల భవిష్యత్తు నాణ్యమైన బోధనపై ఆధారపడి ఉంటే, ఇలాంటి మోసాలు వారి వృత్తి జీవితాన్ని ప్రమాదంలోకి నెడతాయి.విద్యార్థుల ఆత్మహత్యలు ఈ వ్యవస్థలోని మరొక విషాదకర కోణం. ముఖ్యంగా కార్పొరేట్ కోచింగ్ క్యాంపస్‌లలో ఒత్తిడి, మార్కుల పోటీ, కఠిన నియమాలు, తల్లిదండ్రుల అంచనాలు కలసి మానసిక ఆరోగ్య సమస్యలను పెంచుతున్నాయి. ప్రతి సంవత్సరం పలు రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్ కోచింగ్ చదువుతున్న విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడిన వార్తలు వస్తూనే ఉన్నాయి. ఇది కేవలం వ్యక్తిగత వైఫల్యం కాదు; ఇది వ్యవస్థ వైఫల్యం. హాస్టల్ వసతుల పరిస్థితి కూడా ఆందోళనకరం. అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, తగిన భోజనం, పరిశుభ్రత, భద్రత కల్పించకపోవడం పలు తనిఖీల్లో బయటపడింది. కొన్నిచోట్ల అగ్నిమాపక నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. విద్యార్థులపై కఠిన నియంత్రణలు అమలు చేసి, ఫిర్యాదులు బయటకు రాకుండా అణచివేసే ఆరోపణలు కూడా ఉన్నాయి. మీడియాలో వచ్చిన కొన్ని కథనాల ప్రకారం, ఒక ప్రముఖ విద్యాసంస్థల గ్రూప్‌లో విద్యార్థి నాయకులను బెదిరించి, హింసించిన కేసు కోర్టు వరకు వెళ్లింది. ఇది విద్యా సంస్థలలో ప్రజాస్వామ్య హక్కులు ఎంత వరకు పరిరక్షించబడుతున్నాయనే ప్రశ్నను లేవనెత్తుతుంది. విద్యార్థి సంఘాలు, అభిప్రాయ స్వేచ్ఛ, ఫిర్యాదు వ్యవస్థలు బలహీనంగా ఉన్నప్పుడు, అక్రమాలు పెరగడం సహజం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో అనేక కమిటీలను నియమించాయి. అక్రెడిటేషన్ వ్యవస్థలో పారదర్శకత పెంచాలని, ఫీజు నియంత్రణ కమిషన్లు ఏర్పాటు చేయాలని, ఫ్యాకల్టీ అర్హతల డిజిటల్ ధృవీకరణ చేయాలని సిఫార్సులు వచ్చాయి. కానీ అమలు విషయంలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. నివేదికలు అల్మారాల్లోనే ఉండిపోతే, మార్పు ఎలా వస్తుంది? ఈ పరిస్థితికి మూల కారణాలు ఏమిటి? ఒకటి, విద్యను సేవగా కాక వ్యాపారంగా చూడడం. రెండోది, నియంత్రణ సంస్థల బలహీనత. మూడోది, తల్లిదండ్రులలో ర్యాంక్ మోజు. నాలుగోది, రాజకీయకార్పొరేట్ సంబంధాలు. విద్యా సంస్థలు రాజకీయ అనుబంధాలతో పనిచేసినప్పుడు, కఠిన చర్యలు తీసుకోవడం కష్టం అవుతుంది. పరిష్కారం ఏమిటి? మొదటిగా, అక్రెడిటేషన్, ర్యాంకింగ్ ప్రక్రియలను పూర్తిగా డిజిటలైజ్ చేసి, సమర్పించిన డేటాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలి. రెండవది, ఫ్యాకల్టీ అర్హతలను ఆధార్ లేదా యూనిక్ ఐడీ ద్వారా కేంద్రీకృత డేటాబేస్‌లో నమోదు చేయాలి. మూడవది, తప్పుడు ప్రకటనలపై భారీ జరిమానాలు విధించాలి. నాలుగవది, ప్రతి విద్యా సంస్థలో స్వతంత్ర మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్ వ్యవస్థ తప్పనిసరి చేయాలి. ఐదవది, హాస్టల్ తనిఖీలను సడెన్ ఆడిట్ల ద్వారా కఠినంగా అమలు చేయాలి. విద్యార్థులు కేవలం ఫీజులు చెల్లించే కస్టమర్లు కాదు; వారు దేశ భవిష్యత్తు. విద్యా రంగంలో అక్రమాలు కేవలం ఆర్థిక నష్టం కాదు; అవి నైతిక నష్టం. ఒక తరాన్ని తప్పుదోవ పట్టించే ప్రమాదం. కాబట్టి, కఠిన చట్టాలు, పారదర్శక అమలు, సామాజిక ఒత్తిడి—ఈ మూడు కలిసే మార్పు తీసుకురాగలవు. విద్యా సంస్థలు గుర్తింపు కోసం నాటకాలకన్నా, నాణ్యత కోసం కృషి చేస్తేనే భారతదేశం జ్ఞాన శక్తిగా ఎదగగలదు. లేకపోతే ర్యాంకులు పెరిగినా, విలువలు తగ్గిపోతాయి. జ్ఞానం ఆలయం వ్యాపార కాంప్లెక్స్‌గా మారితే, సమాజం మొత్తం మూల్యం చెల్లించాల్సిందే.

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

నగర పోరులో 'జై బీసీ ఎస్సీ ఎస్టీ తెలంగాణ' ప్రభంజనం



సంపతి రమేష్
7988579428

దశాబ్దాల క్రితం "నీళ్లు-నిధులు-నియామకాలు" అనే నినాదంతో ఉవ్వెత్తున ఎగిసిన "జై తెలంగాణ" ఉద్యమం రాష్ట్రాన్ని సాధించింది. ఈ ఉద్యమంలో మెజారిటీ ప్రజలైన బీసీ, ఎస్సీ, ఎస్టీలు తమకు ప్రయోజనం కలుగుతుందని భ్రమపడి భాగమయ్యారు. వారి త్యాగాలు, పోరాటాలతోనే రాష్ట్రం సిద్ధించింది. కానీ స్వరాష్ట్రంలో అట్టడుగు వర్గాల ప్రాతినిధ్యం అంచులకే పరిమితమయ్యారు. అగ్రకులాలే ఆధిపత్యమే కొనసాగుతుంది. అంతిమంగా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం బహుజనుల భుజాలపై నడిచింది, కానీ అధికార ఫలితాలు మాత్రం అగ్రకులాలకు చేరాయి. ఇది సామాజిక న్యాయానికి, భారత రాజ్యాంగానికి విరుద్ధం. ఈ క్రమంలో అగ్రకుల ఆధిపత్యానికి అభిముఖంగా "బహుజన కులాల వాటా ఎంత?" అనే చారిత్రాత్మక ప్రశ్న గర్జించింది. ఆ ప్రశ్ననే డాక్టర్ విశారదన్ మహరాజ్ ఉద్యమంగా మలిచారు. అదే "జై బీసీ ఎస్సీ ఎస్టీ తెలంగాణ" నినాదం. గతంలో ఐదు వేల కిలోమీటర్ల మహాకాళి నడక, పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర ద్వారా సబ్బండ కులాల రాజ్యాధికార వాటాను అడిగాడు. ఇప్పుడు లక్ష కిలోమీటర్ల రథయాత్ర ద్వారా ప్రతిపక్షమై ప్రశ్నిస్తున్నాడు. ఆయన ధర్మ యుద్ధ యాత్ర తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించింది. ఇది సాంప్రదాయ కుల సంఘాలకు, ఉద్యమాలకు అతీతంగా రాజ్యాంగ రాజనీతికి, కులాల చైతన్యానికి కొత్త నిర్వచనం ఇచ్చింది. ఇది హక్కులు, అవకాశాలకే పరిమితం కాకుండా జనాభా దామాషా ప్రకారం భాగస్వామ్యం, ప్రాతినిధ్యానికి పెద్దపీట వేసింది. మొన్నటి పంచాయతీ ఎన్నికల్లో, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల గెలుపు దీనికి నిదర్శనం. ఇది భారతదేశ చరిత్రలో అతిపెద్ద సామాజిక విజయం.

ఈ ఎన్నికలు సామాజిక అస్తిత్వానికి గీటురాయి

తెలంగాణ రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష, విపక్ష పార్టీల కులగణన, బీసీ రిజర్వేషన్ల వ్యూహాలు ఆదిలోనే విఫలమయ్యాయి. చిత్తశుద్ధి లేని ఈ పార్టీల వాగ్దానాలను "జై బీసీ ఎస్సీ ఎస్టీ తెలంగాణ" వాదం ఎండగట్టింది. దీని ప్రభావంతో మొన్నటి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలు మొత్తం 86.4 శాతం గెలిచి చరిత్ర సృష్టించారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో 82 శాతం విజయం సాధించారు. పార్టీ గుర్తులతో జరిగిన ఈ ఎన్నికల్లో పార్టీ బలబలాలకు నిదర్శనం. అయినా బీసీ ఎస్సీ ఎస్టీ వాదమే నిలిచింది. నగర పోరులో రాజకీయ పార్టీల సామాజిక సమీకరణాలు పరిశీలిస్తూ....అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు గతానికి భిన్నంగా బీసీ,ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన మొత్తం సీట్లు 81 శాతం అయితే 82 శాతం గెలిచారు. కేటాయించిన స్థానాల కన్నా బహుజనులు అధికంగా గెలిచారు. ప్రత్యేకంగా బీసీలకు కేటాయించిన సీట్లు 53 శాతం అయితే 55 శాతంపైగా గెలవడం చరిత్రలో మొదటిసారి. మరోవైపు చైర్మన్ పదవుల్లో సైతం బీసీ ఎస్సీ ఎస్టీలకు 77 శాతం రావడం అతి పెద్ద విజయం. జనరల్ స్థానాల్లో పైకులాల సామాజిక, ఆర్థిక ఆధిపత్యం ఉన్నప్పటికీ, బహుజనులకు టికెట్లు ఇవ్వడం, గెలిపించుకోవడం వంటి తప్పని పరిస్థితి పార్టీలపై ఏర్పడింది. ఇది బహుజన వాదం సృష్టించిన అనివార్యతనే. చైర్మన్ పదవుల విషయంలో పార్టీలకు సంబంధించిన అగ్రకులాలే అధికంగా పోటీపడి ఎన్నికవుతారు. కానీ దీనికి భిన్నంగా పార్టీలే ముందుండి బహుజనులను చైర్మన్ లు చేయడం ఈ ఎన్నికల ప్రత్యేకత.



పార్టీలు ఊహించని విప్లవ చైతన్యం

గతానికి భిన్నంగా ఈ ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలు తమ ఆత్మ అభిమానానికి పెద్దపీట వేశారు. తమ అవకాశాలను నిరాకరించిన పార్టీలకు రాజీనామాలు చేశారు. ఆధిపత్య కుల అభ్యర్థులను తిరస్కరించారు. వనపర్తిలో చీర్ల రజినీ ఘటన ఇందుకు నిదర్శనం. అధికార పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న చీర్ల చందర్, అతని భార్య చీర్ల రజిని మూడోవార్డు కౌన్సిలర్ గా గెలుపొందినది. బీసీ, ఎస్సీ, ఎస్టీలను పక్కనపెట్టి అగ్రకుల నాయకుడికి చైర్మన్ పదవి ఇవ్వడంతో ఆమె పార్టీకి, పదవికి రాజీనామా చేయడం ఇది కులస్వామ్య ఆధిపత్యానికి బహిరంగ సవాల్. హుస్నాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 20 మంది వార్డులకు గాను అధికార పార్టీ 19 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీలకు టికెట్లు ఇచ్చింది. బహుజనులంతా ఏకమై వీరిని గెలిపించుకున్నారు. ఒక అగ్రకుల వ్యక్తికి టికెట్ ఇస్తే అతన్ని ఓడించారు. మరోవైపు బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కేసువేసిన 'రెడ్డి జాగృతి' అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డినీ మున్సిపల్ ఎన్నికల్లో బీసీ ఎస్సీ ఎస్టీలు ఏకమై ఓడించారు. ఆయన మూడుచింతలపల్లి పరిధిలోని కేశవాపూర్ 10వ వార్డు అభ్యర్థిగా బిఆర్ఎస్ పార్టీ తరపున పోటీచేశారు. ఈ మార్పులు బీసీ, ఎస్సీ, ఎస్టీల చైతన్యానికి, అస్తిత్వానికి ప్రతీక. ఇప్పటివరకు సమ సమాజ స్థాపనే లక్ష్యం అనే వామపక్ష, నక్సలైట్ పార్టీలు సాధించని విజయం "జై బీసీ ఎస్సీ ఎస్టీ తెలంగాణ" వాదం సాధించిందని రుజువవుతుంది, సామాజిక న్యాయాన్ని తెరపై తెస్తున్న ప్రధాన రాజకీయ పార్టీల ఊహకందని విప్లవ చైతన్యం ఇదీ.

"జై బీసీ ఎస్సీ ఎస్టీ తెలంగాణ" విప్లవం రావాలంటే?

శతాబ్దాలుగా అణచివేత, వెనుకబాటుతనం, అవకాశాల లేమితో కూనరిల్లిన దళిత, బహుజనులు నిర్ణయాత్మక స్థానాల్లోకి రావడం భారత ప్రజాస్వామ్య శక్తికి నిదర్శనం. మొన్నటి పంచాయతీ, నేడు మున్సిపల్ ఎన్నికలలో బహుజనుల గెలుపు దీనికి తార్కాణం. పూలే, అంబేద్కర్, కాన్షిరామ్ సైదాంతిక ఆలోచనతో డాక్టర్ విశారదన్ మహరాజ్ బలపరుస్తున్న "జై బీసీ ఎస్సీ ఎస్టీ తెలంగాణ" వాదమే ఈ మార్పుకు ప్రధాన కారణం. ఇది అగ్రకుల రాజకీయాల పరివర్తనకు, అణగారిన కులాల చైతన్యానికి బీజం వేసింది. ""ఒక విప్లవం కోసం జరుగుతున్న యుద్ధంలో మొదటగా పాలకవర్గాలు ఆత్మరక్షణలో పడి తన వ్యవస్థలో ఉన్న అణగారిన వర్గాల అందరికీ గౌరవాన్ని, స్థానాలని ఇస్తూ ఉంటాయి. ఇది మన విప్లవాత్మక ఉద్యమానికి వచ్చే మొదటి దశ బై ప్రొడక్ట్ అంటే ఉపలబ్ది. అసలైన విప్లవానికి ముందు ఇలాంటివి రావడం సహజం. మన విప్లవం సాధించి అంతిమంగా మన రాజ్యం రావడానికి ముందుగా జరిగే ప్రక్రియ ఇదే. ఇది కూడా ఒక రకమైన విజయం. కానీ ఈ మార్పు విప్లవం కాదు, ఇది పాలకవర్గాలలో నాటకీయంగానైనా కొంత మేరకు వచ్చిన నిజమైన మార్పుగా మనం భావించవచ్చు"". ఈ మార్పు సంపూర్ణత్వం సంతరించుకోవాలంటే స్వశక్తి, స్వధర్మంతో అట్టడుగు వర్గాలు ముందుకెళ్లాలి. అప్పుడే మెజార్టీ ప్రజల సామాజిక, రాజకీయ జీవితాల్లో నిర్మాణాత్మక మార్పు సాధ్యమవుతుంది. ఇదే రాజ్యాంగం కోరుకున్న సామాజిక న్యాయం. ఇది శివుని సమానత్వం, బసవేశ్వరుడి సమతత్వానికి ప్రతిరూపం. భవిష్యత్ ఎన్నికల్లో "జై బీసీ ఎస్సీ ఎస్టీ తెలంగాణ"వాదం బలపడి దేశ రాజకీయాలను శాసించనుందని విశ్లేషకుల అంచనా. ఇది నిజమే అనిపిస్తుంది. భవిష్యత్తు కోసం సాగుతున్న ఈ మహాసంగ్రామంలో బహుజనులంతా భాగమవడం కనీస ధర్మం.


(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

అందరివాడు ఫజుల్ సార్



అంబీర్ శ్రీకాంత్
81859 68059

సీనియర్ జర్నలిస్ట్, రచయిత, ఉపాధ్యాయుడు, ప్రతిపక్షం పత్రిక సంపాదకుడు ఫజుల్ రహమాన్ సార్.. మృతి వార్త గత నెల 10న చదవగానే సర్.. బోధించిన పాఠాలు, ప్రత్యక్షంగా ఆయనతో గడిపిన సమయంలో చెప్పిన సూచనలు, మెళకువలు ఆయనతో ఉన్న అనుబంధం అన్నీ గిర్రున జ్ఞాపకమొచ్చాయి. కాలచక్రంలో వెనక్కి వెళ్లగా.. సుమారుగా ఏడాది పాటు డెస్క్‌లో ఆయనతోపని చేసిన సమయంలో నాకు ఇచ్చిన సలహాలు ఎంతో విలువైనవి. జీవితంలో అనుక్షణం అనుసరించేవి. రెండు రోజుల పాటు ఆయనకు కనిపించకపోతే చాలు 'పూర్తి నల్లపూస అయిపోయినవ్ శ్రీకాంత్' అంటూ ఆత్మీయంగా ఆయన పలకరింపు.. మనసుకు హత్తుకుంటాయి. నాయకత్వలక్షణాలను నిండుగా పుణికిపుచ్చుకున్న లీడర్ ఆయన. పని విషయంలో ఏ మాత్రం జంకకుండా ఎప్పటికప్పుడు వర్క్ డివైడ్ చేస్తూ.. ఇన్‌టైంలో పేజీలు పూర్తి అయ్యేలా ఆ వయసులోనూ చక్కగా డైరీ తీసుకుని ఆ రోజు తేదీ వేసుకుని పెన్‌తో ఎవరెవరికి ఎన్ని ఐటెంలు ఇచ్చారు, ఎవరి వద్ద పెండింగ్ వర్క్ ఉంది? ఆలస్యం కాకుండా వెంటనే పనులు చక్కబడేలా మరొకరికి వర్క్ అసైన్ చేస్తూ.. సమయం అనే ఒత్తిడి కత్తి వేలాడుతున్న నేపథ్యంలో ఎంతో చాకచక్యంగా పని ముగించేసి.. అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగిన ఆ క్షణాలు గుర్తుకొస్తున్నాయి. సమావేశాల సందర్భంలో ఏ ఒక్కరినీ మరిచిపోకుండా ప్రతీ ఒక్కరి పాజిటివ్ విషయాలను పదుగురికి తెలిసేలా అందరి ముందు మాట్లాడి.. వారిలో నూతనోత్తేజాన్ని నింపడంలో ఆయనకు సాటి ఎవరూ లేరని చెప్పొచ్చు. అంతేకాదు ఎవరైనా తప్పులను చేసిన క్రమంలో వారికి అర్థమయ్యేలా దగ్గరికి పిలుచుకుని వారికి ఒక్కరికి మాత్రమే చెవిలో వినబడేలా చెప్పి.. తప్పులను సరిదిద్దే గురువు ఆయన. కొవిడ్ విపత్కర పరిస్థితులలో ఇంటి నుంచి పనులు నడుస్తున్న కాలంలో ఫోన్ కాల్ చేసి మరీ.. తప్పులు చేసిన వారికి ఏం తప్పు చేశారో చెప్పి.. వాటిని సరిదిద్దేవారు. నేటి తరంతో పోటీ పడి మరీ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటూ.. నిత్య నూతనంగా ముందుకు సాగేవారు ఫజుల్ సర్. ఫీల్డ్ వర్క్‌కు వెళ్లాలనే ఆసక్తి ఉందని నా నిర్ణయాన్ని వెలిబుచ్చగా, సర్.. ఆయన విలేకరిగా పని చేసిన సమయంలో ఎదురైనా అనుభవాలను పూసగుచ్చినట్టుగా చెప్పారు. ముఖ్యంగా రిపోర్టర్‌గా పని చేసే సమయంలో ఏయే విషయాలను చూడగలగాలి? ప్రతీ ఒక్క విషయాన్ని ఎలా అర్థం చేసుకోగలగాలనేది తెలిపారు. హుస్నాబాద్ ప్రాంతంలో ఆనాడు కాంగ్రెస్ నేత బొమ్మ వెంకటేశ్వర్లు అలియాస్ బొమ్మ వెంకన్న ఎన్నికలలో పోటీ చేసిన సమయంలో ఆయన ప్రజలతో ఎలా ఉండే వారు? కవరేజ్‌కు వెళ్లిన సమయంలో ఎదురైన ఇబ్బందులతో పాటు నేతల వ్యక్తిత్వం నాడు ఎలా ఉండేది? వంటి విషయాలను వివరంగా తెలిపారు.కుల మతాలకు



అతీతంగా అందరికీ ఆత్మీయతను పంచిన ఆత్మబంధువు ఆయన. ఆయనతో కలిసి పని చేసిన సమయంలో ఇంటి వద్ద నుంచి చపాతీలను తీసుకొచ్చి ప్రేమతో ప్రతీ ఒక్కరికీ అందజేసి..ప్రేమను ప్రతీ ఒక్కరికీ పంచిన స్నేహితుడు. స్నేహశీలి మాత్రమే కాదు. ఆయన మృదుస్వభావి. సమయం వచ్చినపుడు ఏదైనా విషయమై ఇన్‌చార్జి లేదా పై స్థాయి వ్యక్తులతో నిక్కచ్చిగా విషయాన్ని తెలిపి.. తన బృందానికి నాయకత్వంవహిస్తూ.. ముందుకు సాగిన లీడర్. సమకాలీన విషయాలపైన ఆయన కవితారూపంలో నాలుగైదు పాదాలలో పూర్తిగా నేటి సందర్భం స్ఫురించేలా చక్కటి కవితలను అందిస్తూ.. వాటి కోసం తపన పడే వారు. పీడిత వర్గాల పక్షాన పోరాటం ఎంచుకుని ముందుకు సాగాలనే సందేశాన్ని ఇచ్చిన ఫజుల్ రెహమాన్ సర్‌కు అక్షర నివాళి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

నాగర్‌కర్నూల్ జాతర ఘటనపై ఆగ్రహం

- బాధ్యులను అరెస్టు చేయాలి
- పాలమాకుల యువకుల డిమాండ్
- కొవ్వొత్తులతో ర్యాలీ
- బాధిత కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి



ప్రతిపక్షం, నంగునూరు, ఫిబ్రవరి 24 : నాగర్ కర్నూల్ మండలం పరిధిలో నిర్వహించిన కుమ్మెర మల్లన్న జాతర సందర్భంగా దైవ దర్శనానికి వెళ్లిన రజక కుటుంబానికి చెందిన చంద్రకళ కుటుంబంపై దాడిలో పసిపాప మృతి చెందిన ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు యువకులు డిమాండ్ చేశారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో మంగళవారం యువజన సంఘం ఆధ్వర్యంలో చిన్నారికి నివాళిగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని వీధుల గుండా పాలమాకుల బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ర్యాలీలో పాల్గొన్నవారు నినాదాలు చేస్తూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ ఈ ఘటనకు కారణమైన జాతర నిర్వాహకుడు తుకారాం రెడ్డి సహా బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై వెంటనే కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేయాలని కోరారు. చిన్నారి మృతికి కారణమైన వారందరినీ చట్టపరంగా శిక్షించాలని స్పష్టం చేశారు. మల్లన్న దర్శనం కోసం వెళ్లిన చంద్రకళ కుటుంబంపై దాడి చేయడం అమానుషమని, సామాజికంగా అసహ్యకరమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలమాకుల గ్రామ యువత, రజక సంఘం నాయకులు బసవరాజు రాములు, బసవరాజు స్వామి, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఏటి ఆంజనేయులు, ఎండి యాకూబ్, సుందు నర్సింలు, అజయ్, దర్శనం అమరేందర్, సంపంగి కుమార్, భోగి సాగర్, చుంచు చంద్రశేఖర్, నెల్లుట్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

నంగునూరులో కొవ్వొత్తుల ర్యాలీ

ప్రతిపక్షం, నంగునూరు, ఫిబ్రవరి 24 : నాగర్ కర్నూలు జిల్లా కొమ్మెర మల్లన్న జాతరలో రజక కుటుంబంపై జరిగిన దాడిని నిరసిస్తూ నంగునూరు మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ ర్యాలీలో వివిధ వర్గాల ప్రజలు, యువత, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సామాజిక ఐక్యతను కాపాడాలని కోరారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని అన్నారు. న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనరాజు నాగరాజు, చెలికాని యాదగిరి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎనగందుల నితిన్ కుమార్, తుపాకుల శ్రీనివాస్, రాగుల కనకయ్య, అనరాజు చందు, అనరాజు శ్రీకాంత్, అనరాజు రాజ్ కుమార్, దేవులపల్లి నవీన్, అనారాజు గణేశ్ కొత్తగొళ్ల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి 24 : చేగుంట మండలం గొల్లపల్లి మాజీ సర్పంచ్ టిఆర్ఎస్ నాయకులు చేర్యాల రఘుపతి రెడ్డి అనారోగ్యంతో మృతి చెందినందున ఆ కుటుంబాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. చేర్యాల రఘుపతి రెడ్డి ఉప సర్పంచ్ తో పాటు సర్పంచ్ గా పదవి బాధ్యతలు చేపట్టారు. ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ గా రఘుపతి రెడ్డి కొనసాగారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నారాయణరెడ్డి గొల్లపల్లి సర్పంచ్ సబితా జనార్దన్ రెడ్డి చేగుంట మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్ టిఆర్ఎస్ నాయకులు జీవన్ రెడ్డి కాశబోయిన సుదర్శన్ మైపాల్ రెడ్డి చేర్యాల మోహన్ రెడ్డి మాజీ ఎంపీటీసీ బింగి గణేష్ గువ్వలేగి సర్పంచ్ శేఖర్ రెడ్డి గ్రామ నాయకులు పాల్గొన్నారు.





అకాల వర్షం.. అన్నదాత కంటతడి!

- నేలకొరిగిన మొక్కజొన్న, పొద్దుతిరుగుడు
- పంటలను పరిశీలించిన డీఏఓ

ప్రతిపక్షం, మిడిదొడ్డి, ఫిబ్రవరి 24 : అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం చెరుకు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి మిరుదొడ్డి మండలం అందే, మిరుదొడ్డి, కొండాపూర్, ధర్మారం గ్రామాలను జిల్లా వ్యవసాయ అధికారిని స్వరూపారాణితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొండాపూర్ లో 88, మిరుదొడ్డిలో 380, ధర్మారంలో 53, అందేలో280 ఎకరాల పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రైతులను అన్ని విధాల ఆదుకుంటామన్నారు. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించి న్యాయం చేస్తామన్నారు. ఆత్మ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

ప్రతి పక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 24 : నేటి నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా దుబ్బాక నియోజకవర్గంలోని విద్యార్థినీ, విద్యార్థులకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితంలో ఒక కీలకమైన మలుపు అని పేర్కొన్నారు. మీరు ఏడాది పొడవునా కష్టపడి చదివిన పాఠాలను ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో రాయాలని సూచించారు. పరీక్షల సమయంలో ఆందోళనకు లోనుకాకుండా ప్రశాంతంగా ప్రతి ప్రశ్నకు సమగ్రంగా సమాధానాలు ఇవ్వాలని కోరారు.మీ శ్రమే మీ విజయానికి బాటవేస్తుంది. మంచి ఫలితాలు సాధించి మీ తల్లిదండ్రులకు, గురువులకు గర్వకారణం కావాలన్నారు. ఈ పరీక్షలు మీ భవిష్యత్తు లక్ష్యాలకు పునాది రాయిలాంటివని తెలిపారు. పట్టుదలతో ముందుకు సాగితే విజయం మీ సొంతమవుతుంది అని తెలిపారు.దుబ్బాక నియోజకవర్గంలోని ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ ఫిబ్రవరి 24:- గుడిలోకి వచ్చారని రజకులపై దాడి, పసిబిడ్డను హతమార్చిన అగ్రవర్ణాలపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మెదక్ పట్టణ రజక సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి పేట విజయ్ ఆధ్వర్యంలో స్థానిక బస్ డిపో నుండి రాందాస్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అగ్రవర్ణాల చేతిలో చనిపోయిన చిన్నారి మృతికి కారణమైన వారిని వెంటనే శిక్షించాలని చిన్నారి ఆత్మకు శాంతి కలగాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మెదక్ పట్టణ రజక సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి పేట విజయ్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెరలో జరిగిన దాడిపై తూతూ మంత్రంగా కోర్టులో నిలబడని సెక్షన్ పైన కేసు చేశారని, ప్రభుత్వం విచారణ జరిపి వారికి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. చిన్నారి మృతికి కారణమైన అగ్ర కులాల పైన హత్య కేసు నమోదు చేయాలని వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ప్రభుత్వ స్పందించి చిన్నారి కుటుంబం పై తగు న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నవీన్ చౌదరి, వేణు, గంగులు, శివ, శ్రీను, రమేష్, వెంకట్, రాజు, భాను, మహేందర్, శ్రీను, రమేష్, కర్ణాకర్, మహేష్, మహేందర్, సంజయ్, యేసు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాల కవాతు

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలో మంగళవారం నాడు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి కవాతు నిర్వహించాయి . ఈ సందర్భంగా గజ్వల్ ఏసిపి నరసింహులు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా ప్రజలకు అండగా ఉండేందుకు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలతో కలిసి కవాతు నిర్వహించినట్లు తెలిపారు . శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయిని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై ధ్యాస ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ , ఎస్ ఐ ప్రేమ్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మూగజీవాల పట్ల దాతృత్వం చాటుకున్న మెదక్ డీపీఆర్వో రామచంద్ర రాజు



ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ ఫిబ్రవరి 23 : మెదక్ జిల్లా కేంద్రంలో ఉదయం స్టేడియం వద్ద క్రికెట్ ప్రాక్టీస్ నెట్ నందు దురదృష్టవశాత్తు చిక్కుకొని ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న అడవి కుందేలు పిల్లను ఉదయం వాకింగ్ లో భాగంగా అటుగా నడిచి వెళ్తున్న డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, మెదక్ పశువర్ధక శాఖ డాక్టర్, ఎండి కాజా సలావిద్దీన్, ఏపీఆర్ఓ బాబు, గమనించడం జరిగింది .వెంటనే స్పందించిన డి పి ఆర్ ఓ చలించిన హృదయంతో మానవీయ కోణంలో వెంటనే దానిని రక్షించి మెదక్ పశువర్ధక డాక్టర్ గారు వద్దకు తీసుకువెళ్లగా చికిత్స అందించడం జరిగింది. ప్రస్తుతం అది కోలుకున్నది.ఈ సందర్భంగా డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు మాట్లాడుతూ పశుపక్షాదులు మూగజీవాలు పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని వేసవి తాపాన్ని తట్టుకోలేక తాగునీటి కోసం చెలిమలు, ఇండ్ల వద్ద కుళాయిలు గోలేలు వద్దకు జంతువులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు వాటికి ఎటువంటి హాని తలపెట్టకుండా ఉండాలన్నారు. మూగ జీవాలు పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉంటే ఆ భగవంతుని కరుణాకటాక్షాలు మనకు సిద్ధిస్తాయని ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రతి ఒక్కరు మూగజీవాలను పరిరక్షించాలని చెప్పారు.



రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో సిద్దిపేట పోలీసుల సత్తా..

- 12 పతకాలతో మెరిసిన జిల్లా బృందం
- అభినందించిన సీపీ రష్మీ పెరుమాళ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 24 : సిద్దిపేట జిల్లా పోలీస్ సిబ్బంది 4వ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలు,స్పోర్ట్స్ మీట్ 2026లో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో తమ సత్తా చాటారు. వివిధ విభాగాల్లో పోటీపడిన మొత్తం 9 మంది సిబ్బంది 12 పతకాలను సాధించి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టారు.ఈ క్రీడల్లో సిద్దిపేట పోలీస్ యూనిట్ కు 3 బంగారు, 2 వెండి, 7 కాంస్య పతకాలు లభించాయి. బంగారు పతకాలను రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ రోహిత్, సబ్ ఇన్స్పెక్టర్ అంజయ్య, కానిస్టేబుల్ డి.రాజు సాధించారు. వెండి పతకాలను డి.లక్ష్మణ్, జె.రాజు గెలుచుకోగా, ఇతరులు కాంస్య పతకాలు అందుకున్నారు.విజేతలను పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అభినందిస్తూ, విధి నిర్వహణలో ఉన్న ఒత్తిడిని అధిగమించి క్రీడల్లో రాణించడం గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, శాఖ తరఫున పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, అదనపు డీసీపీ ఎఆర్ సుభాష్ చంద్రబోస్, ఇన్స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్ గౌడ్ పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.



అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివి

- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ రావు
- లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ
- రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేత

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 24 :- ఇందిరమ్మ రాజ్యంలోని తెలంగాణ ప్రభుత్వానికిఅభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావ్ అన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హవెలి ఘనపూర్ మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీలేదన్నారు. గతంలో ఎన్నడూ లేని విదంగా మెదక్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్లు తెలిపారు. ఒకవైపు అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తూనే డెవలప్మెంట్ పై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.పదేళ్ల బిఆర్ఎస్ పాలన లో రేషన్ కార్డు ఇవ్వలేని దుస్థితి ఉండేదని, తమ ప్రభుత్వంలో నిరంతర ప్రక్రియగా చేశామన్నారు. డ్వాక్రా మహిళలకు కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా వడ్డీలేని రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం ద్వారా డబ్బులు ఆదా చేస్తున్నట్లు తెలిపారు.కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద మెదక్ నియోజకవర్గం లో ఇప్పటివరకు దాదాపు రూ 5కోట్లు అందజేశామన్నారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.దేశంలో ఎక్కడ లేని విదంగా రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. యాంత్రికరణ పథకం ద్వారా రైతులకు సబ్సిడీ పై వ్యవసాయ పరికరాలు అందజేసినట్లు తెలిపారుఅందజేశామన్నారు.ఒక్కొక్కటిగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఎడి విజయ నిర్మల హవెలి ఘనపూర్ తహసీల్దార్ సింధు రేణుక, మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మందుగుల గంగాధర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పరుశరామ్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు అంజనేయులు గౌడ్, శంకర్ గౌడ్,దాయర రవి, హాఫిజ్, నాగిరెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న కార్యదర్శికి సన్మానం

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 24 : మండల పరిధిలోని కొడకండ్ల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా గత నాలుగున్నర ఏళ్లుగా సేవలందించి, బదిలీపై వెళ్తున్న శ్రీకాంత్‌ను మంగళవారం గ్రామ పాలకవర్గం ఘనంగా సన్మానించింది. వర్గల్ మండలం మైలారం గ్రామానికి బదిలీ అయిన సందర్భంగా సర్పంచ్ లక్ష్మీ కొండయ్య, ఉప సర్పంచ్ జ్యోతి నర్సింలు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ప్రణాళికల్లో కార్యదర్శి కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





టీమ్ ఇండియా సౌతాఫ్రికా చేతిలో ఓడినా ఫైనల్‌కు వెళ్తుంది. ఇప్పుడు టీమ్ ఇండియాపై ఒత్తిడి ఉంది. కానీ ప్రపంచంలో అది బెస్ట్ టీ20 టీమ్ అని నేను నమ్ముతా. వారికి బాగా తెలిసిన కండీషన్లలో ఆడుతున్నారు. సూపర్-8లో జింబాబ్వేను సులభంగా ఓడిస్తుంది. వెస్టిండీస్‌తో మ్యాచ్ ఉత్కంఠగా ఉండనుంది. అందులో గెలిచిన టీమ్ సెమీస్‌కు అర్హత సాధిస్తుంది.

- ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్

ప్రాంతీయం

బీఆర్ఎస్ పదేళ్లలో చేసిందేమీ లేదు

- ఎమ్మెల్యే నాయిని విమర్శలు



ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 24 : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. డబ్బు కోసం చేసే రాజకీయాలకే బీఆర్ఎస్ పరిమితమైందని అన్నారు.పదేళ్ల పాలనలో అభివృద్ధిని కుంటుపడేసి, ఇప్పుడు విమర్శలనే ఆయుధంగా చేసుకుని జిల్లాల్లో జెమిని సర్కస్ మాదిరిగా పర్యటనలు చేస్తున్నారు" అని ఆయన అన్నారు. చేసిన పనులు లేకపోవడంతో రోజువారీ ఆరోపణలకే పరిమితమవుతున్నారని విమర్శించారు.మూడు రోజులుగా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం సమగ్రంగా ఆలోచిస్తోంది. పదేళ్లలో చేయలేని వారు ఇప్పుడు పరిశీలన పేరుతో మాట్లాడటం సిగ్గుచేటు అని అన్నారు. దాదాపు పూర్తికావొచ్చిన దవాఖానను బయట నుంచే చూసి విమర్శలు చేయడం తగదని పేర్కొన్నారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి ఆధునిక పరికరాలు విదేశాల నుంచి రానున్నందున కొంత జాప్యం సహజమని వివరించారు. వరంగల్ మాజీ నేతలకు ఎమ్మెల్యే సూటి ప్రశ్నలు సంధించారు ఉమ్మడి వరంగల్ జిల్లాను విభజించినప్పుడు కానీ, నిధుల కేటాయింపుల విషయంలో కానీ మీ నాయకులను ఎప్పుడైనా ప్రశ్నించారా? మీ కాలంలో జరిగిన అభివృద్ధి ఎంత, గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధి ఎంత అనే అంశంపై చర్చకు సిద్ధమా?" అని సవాల్ విసిరారు. బినామీ పేర్లతో కోట్ల రూపాయలు కూడబెట్టిన నేతలు ఇప్పుడు పారదర్శకతపై మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. టెక్స్టైల్ పేరుతో అట్టహాసంగా ప్రకటించిన ప్రాజెక్టులు భూమి దశ దాటలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గణనీయమైన అభివృద్ధి జరుగుతోందని, రెండున్నరేళ్లలో తీసుకొచ్చిన పనులు ఎటువంటి అవకతవకలు లేకుండా సాగుతున్నాయని తెలిపారు. కాంట్రాక్టర్లపై కమిషన్ల ఒత్తిడి లేదని స్పష్టం చేశారు. "సలహాలు ఉంటే ఇవ్వండి. ఎన్నికల వరకు రాజకీయాలు చేద్దాం. కానీ దాడుల రాజకీయాలను నేను ఎప్పుడూ ప్రోత్సహించలేదు" అని అన్నారు. గౌరవ పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను ఎన్నికల సమయంలో తప్పకుండా వచ్చి ఓటు హక్కును వినియోగించుకోండి.మీ ఓటు హక్కు వినియోగించుకోలేని పక్షంలో గూండాలు రౌడీలు రాజ్యమేలుతారని.చదువుకున్న విజ్ఞవంతులుగా మీరు సరైన సమయంలో రానున్న ఎన్నికల్లో నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. ప్రజల తీర్పే తుది తీర్పు అని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, జిల్లా RTA మెంబెర్ పల్లకొండ సతీష్, ఆలయ కమిటీ డైరెక్టర్ సతీష్, బ్లాక్ అధ్యక్షులు బంక సంపత్, లక్ష్మారెడ్డి, నాయకులు నలుబోల సతీష్, సుగుణాకర్ రెడ్డి, తడుక సుమన్, పున్నం, నాగరాజు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.




రాష్ట్రస్థాయి ఆంగ్ల ఉపన్యాస పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రతిపక్షం, నంగునూరు, ఫిబ్రవరి 24 : గ్రామంలో నైపుణ్యం(స్కిల్ ఇన్ విలేజ్) కాకతీయ సాండ్ బాక్స్, దేశ్ పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆంగ్ల ఉపన్యాస పోటీలలో నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాల, మండల, జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారికి నిజామాబాద్ లో సోమవారం రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 3,400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జిల్లాస్థాయి పోటీలకి 10 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఉపన్యాస పోటీలలో జూనియర్ విభాగంలో ఐదుగురు, సీనియర్ విభాగంలో ఐదుగురు పాల్గొన్నారు. వీరి నుండి రాష్ట్ర స్థాయికి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. జూనియర్ విభాగంలో ఆరవ తరగతి విద్యార్థి శరణ్య, సీనియర్ విభాగంలో ఎనిమిదవ తరగతి విద్యార్థి శివకుమార్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి ఆంగ్ల ఉపన్యాస పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో సీనియర్ విభాగంలో ద్వితీయ, జూనియర్ విభాగంలో తృతీయ బహుమతిని అందుకున్నారు.రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులను మంగళవారం నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి అభినందించారు.

పరీక్షల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు

- సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 24 : జిల్లాలో రేపటి నుండి ప్రారంభమవుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు మరియు మార్చి 14 నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. పరీక్షల నిర్వహణపై మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రశ్నాపత్రాల రవాణా నుండి పరీక్షా కేంద్రాలకు చేరేవరకు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఫర్నిచర్ కొరత లేకుండా, విద్యార్థులకు తగిన కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లాలో పరీక్షల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను సీఎస్‌కు వివరించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు జిల్లావ్యాప్తంగా 54 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 54 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 22 మంది అదనపు సూపరింటెండెంట్లు, 54 మంది డిపార్ట్మెంటల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. పరీక్షల పర్యవేక్షణకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 17,762 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 18,224 మంది విద్యార్థులు హాజరు కానుండగా, జిల్లాలో మొత్తం 35,986 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మార్చి 14 నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు జిల్లాలో 24,657 మంది విద్యార్థులు హాజరుకానున్నారనీ ,ఈ పరీక్షల కోసం 123 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పరీక్షలను విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పాండు, డీఈవో వెంకటేశ్వర్లు, డిఐఈఓ గోవింద్ రామ్, డిటిఓ కవిత, జడ్పీ సీఈవో, డిపిఓ జానకి రెడ్డి, డిఎంఎల్ హెచ్ఓ వసంత్ రావు, ఆర్టీసీ, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నారు

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 24 : చింత మడక గ్రామం లో జరిగిన బీరప్ప ఉత్సవాల్లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా బీరప్ప స్వామి ని దర్శించుకున్నారు.గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని మాట్లాడారు.కెసిఆర్ మీ అందరిని అడిగనట్లు చెప్పారని, బీరప్ప ఉత్సవాలకు సహాయం కూడ అందించారన్నారు. కెసిఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని బీరప్ప స్వామి దయతో మీ అందరి ఆశీస్సులతో కెసిఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి అవుతాడన్నారు.బీరప్ప ఉత్సవాలు అద్భుతంగా నిర్వహించారని గ్రామం,ప్రజలు అందరు ఐక్యత తో ఉండాలని ఆకాంక్షించారు.నా వంతు సహాయం గా కూడా లక్ష రూపాయలు ఇచ్చానన్నారు. స్వామి దయతో అన్నింటా శుభం జరగలాన్నారు.

రైతు బజార్‌ను సందర్శించిన హరీష్ రావు

సిద్దిపేట పట్టణంలోని మోడల్ రైతు బజార్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సందర్శించి రైతులతో ఆత్మీయంగా ముచ్చటించారు. రైతు బజార్‌లో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు, గతంలో ఉన్న విధంగా ఉన్నాయా లేదా అనే విషయంపై రైతుల అభిప్రాయాలు కోరారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రైతు బంధు నిలిచిపోయిందని, విద్యుత్ సరఫరా కూడా సరిగా అందడం లేదని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు హయాంలో రైతులకు రైతు బంధు పథకం ద్వారా ప్రతి పంటకు ఆర్థిక సహాయం అందేదని, 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా ఉండేదని గుర్తుచేశారు. అన్ని సౌకర్యాలు సమృద్ధిగా ఉండేవని పేర్కొన్నారు.కె. చంద్రశేఖర్ రావు మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడితేనే రైతుల పరిస్థితి మెరుగుపడుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా హరీష్ రావు రైతులతో మాట్లాడుతూ వారు పండిస్తున్న కూరగాయల గురించి తెలుసుకున్నారు.రైతుల వద్ద నుంచి కూరగాయలు కొనుగోలు చేసి వారికి ప్రోత్సాహం అందించారు.

మహిళా సంఘాల మార్కెటింగ్ సెంటర్ ప్రారంభం..



సిద్దిపేట రైతు బజార్‌లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు మహిళా సంఘాల (SHG) కోసం ఏర్పాటు చేసిన నూతన మార్కెటింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని ఆయన పిలుపునిచ్చారు.దళారీ వ్యవస్థ లేకుండా రైతులు తమ కష్టానికి తగిన ప్రతిఫలం పొందుతూ, వినియోగదారులకు తక్కువ ధరకే తాజా కూరగాయలు అందిస్తున్న సిద్దిపేట రైతు బజార్ రాష్ట్రంలోనే ఆదర్శ మోడల్‌గా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. నాబార్డ్, గ్రామీణ బ్యాంక్, సెర్ప్ సహకారంతో ఈ మార్కెటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రైతు బజార్‌లో నిత్యం వేలాది మంది సందర్శకులు వస్తుండటంతో భవిష్యత్తులో నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రాంగణం వెలుపల షాపులు నిర్మించామని చెప్పారు. వాటి అద్దెతో పాటు రూ.30 లక్షలను ఫిక్స్డ్ డిపాజిట్ చేసి సుస్థిరమైన వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.మహిళా సంఘాల సభ్యులు కేవలం వ్యాపారులు కాదని, వారు తయారు చేసే ఉత్పత్తుల్లో ఎలాంటి కల్తీ ఉండదని హరీష్ రావు పేర్కొన్నారు. కూరగాయల కోసం వచ్చే పట్టణ ప్రజలు స్వచ్ఛమైన, నాణ్యమైన మహిళా సంఘాల వస్తువులను కూడా కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని సూచించారు.ఈ సెంటర్‌లో తేనె, పసుపు, కారం, పప్పులు, చిరుతిళ్లు, చేనేత వస్త్రాలు, జూట్ బ్యాగులు, హ్యాండ్ బ్యాగులు తక్కువ ధరకే అందుబాటులో ఉంటాయని తెలిపారు. సిద్దిపేట పరిసర గ్రామాల మహిళా సంఘాలన్నీ ఈ వేదికను సద్వినియోగం చేసుకుని తమ ఉత్పత్తులను విక్రయిస్తూ ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించారు.

ఎస్సీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట పిబ్రవరి 24: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని షెడ్యూల్ కులాల బాలికల కళాశాల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించి రాత్రి భోజన ఏర్పాట్లను తనిఖీ చేశారు.హాస్టల్‌లో వడ్డించిన అన్నం, క్యాబేజీ కూర, టమాటా చట్నీ, సాంబారు వంటి వంటకాలను పరిశీలించి నాణ్యతపై ఆరా తీశారు. మొత్తం 100 మంది విద్యార్థులు నమోదు కాగా, ప్రస్తుతం 83 మంది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నట్లు విద్యార్థులు తెలిపారు.విద్యార్థుల హాజరు ప్రకారం సరుకులు అందజేయాలని, ప్రతి వంటకం రుచికరంగా ఉండి అందరికీ సరిపడా ఆహారం పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వసతి మరియు భోజన విషయాల్లో ఎలాంటి కొరతలు లేకుండా చూడాలని సూచించారు. హాస్టల్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా పనిచేయాలని, అక్కడ జరిగే ప్రతి చర్య రికార్డు కావాలని వార్డెన్ శ్వేతకు స్పష్టం చేశారు.స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, వంట సరుకుల వినియోగం, నమోదైన వివరాల మధ్య తేడాలు ఉన్నట్లు గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వహణలో లోపాలు ఉన్నందున వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడిన సందర్భంగా మరుగుదొడ్లు మరమ్మత్తులలో ఉన్నాయని తెలుసుకొని ఈడబ్ల్యూఐడిసి ఇంజినీరింగ్ అధికారులను వెంటనే పరిశీలనకు పంపాలని సూచించారు. అలాగే మిషన్ భగీరథ ద్వారా సరిపడా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటానని, శానిటేషన్ సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పూర్తి చేయాలి

- మాజీ మంత్రి హరీష్ రావు



ప్రతిపక్షం ప్రతినిధి, వరంగల్/హన్మకొండ : సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు వెంటనే పూర్తి చేయాలని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆసుపత్రి పనులు కావాలనే నత్తనడకన సాగిస్తున్నారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ ప్రాజెక్టును ఆలస్యం చేయడం వెనుక రాజకీయ అక్కసే కారణమని ఆయన ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ఆసుపత్రి భవనం 24 అంతస్తుల వరకు పూర్తి చేశామని, 2024 దసరాకే ప్రారంభించాల్సిన ఈ ఆసుపత్రి ఇప్పటికీ అందుబాటులోకి రాకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులపై చూపుతున్న శ్రద్ధలో కనీసం 10 శాతం అయినా వరంగల్ 'హెల్త్ సిటీ'పై పెట్టి ఉంటే ఈపాటికే పనులు పూర్తయ్యేవని విమర్శించారు. వెంటనే సిబ్బంది నియామక ప్రక్రియ పూర్తి చేసి, పూర్తి స్థాయి వైద్య సేవలతో ఆసుపత్రిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. 2000 పడకల ఈ ఆసుపత్రికి అవసరమైన డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నియామకానికి ఇప్పటివరకు క్యాబినెట్ ఆమోదం ఉందా? నోటిఫికేషన్లు జారీ చేశారా? అని ప్రశ్నించారు. కేవలం ఓపీ సేవలతో ప్రారంభించడం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి లక్ష్యాన్ని తుంచివేయడమేనని అన్నారు. అదే విధంగా వరంగల్‌లోని మహాత్మ గాంధీ మెమోరియల్ హాస్పటల్ (ఎంజీఎం) పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఉచిత గుండె ఆపరేషన్లు నిర్వహించామని, ప్రస్తుతం పరికరాలు, సిబ్బంది కొరతతో ఆసుపత్రి సేవలు దెబ్బతిన్నాయని విమర్శించారు. దేవాదుల ప్రాజెక్టు పనుల విషయంలోనూ ప్రభుత్వం డెడ్‌లైన్‌లను మారుస్తూ కాలయాపన చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల ద్వారా లక్షల ఎకరాలకు నీరు అందించిందని, ప్రస్తుతం రైతులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆరోపించారు. వెంటనే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రారంభించకపోతే వరంగల్‌లోనే నిరాహారదీక్షకు దిగుతామని హరీష్ రావు హెచ్చరించారు. ఈ పర్యటనలో పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే కడియం సమీక్ష

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 24 : స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన నియోజక వర్గం లో జరుగుతున్న విద్యుత్ పనుల పురోగతిపై హన్మకొండ నక్కలగుట్ట విద్యుత్ భవన్ లో మంగళవారం సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సమీక్షా సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడుతూ పూర్తిగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు వ్యవసాయం మీద ఆధార పడి దేవాదుల వలన రిజర్వాయర్లో నీళ్లు రావడం చేత పంటల దిగుబడి పెరిగిందని అన్నారు . సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తమ నియోజక వర్గానికి కొత్త 33/11 కెవి సబ్ స్టేషన్లు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు . కొత్తగా మంజూరు అయ్యిన సబ్ స్టేషన్ ల పనుల పురోగతి పై చర్చిస్తూ సాగరం , కొండాపూర్ , కూర్చపల్లి సబ్ స్టేషన్లు ఈ మార్చి నెలాఖరు వరకు చార్జ్ చేసి అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులను ఆదేశించారు . మిగతా సబ్ స్టేషన్ ల టెండర్ ప్రక్రియ , ల్యాండ్ కేటాయింపు తదితర ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకు రావాలని చెప్పారు . ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ గృహాల పై వెళ్తున్న లైన్లను తొలగించాలని , లైన్లు లైని చోట కొత్త లైన్ల విస్తరణ జరపాలని అన్నారు . అలాగే కొత్త మీటర్ల మంజూరు చేయాలనీ చెప్పారు . వినియోగదారులు మెరుగైన , నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాడనికి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు . రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మంచి సేవలు అందిస్తున్నారని , సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి రైతుల కొరకు ఎన్నో కార్యక్రమాలు తీసుకువచ్చారని అందులో పొలం బాట , ఎస్టిమేట్ తెలుగులో అందించడం , త్వరితగతిన సర్వీసుల మంజూరు చేస్తున్నారని అన్నారు. అనంతరం సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ పల్లె బాట కార్యక్రమంలో మధ్య స్థంబాలు వేస్తున్నామని , ప్రమాదభరితంగా ఉన్న లొకేషన్లు గుర్తించి వాటిని మార్చుతున్నామని చెప్పార . అత్యవసర సమయాల్లో బ్రేక్ డౌన్ టీం లు ఏర్పాటు చేసినామని చెప్పారు . కార్యక్రమంలో డైరెక్టర్ ప్రాజెక్ట్స్ వి . మోహన్ రావు , డైరెక్టర్ ఆపరేషన్ టి.మధుసూదన్ , సి.ఈ లు రాజు చౌహాన్ , సురేందర్ , ట్రాన్స్కో సి.ఈ జోన్ వరంగల్ శ్రీ రామ్ కుమార్, జనగాం ఎస్ ఈ సంపత్ రెడ్డి , హన్మకొండ ఎస్ ఈ పి . మధుసుధన్ రావు , డి .ఈ లు లక్ష్మి నారాయణ రెడ్డి , సారయ్య ,, విజయేందర్ రెడ్డి , మల్లికార్జున్ , విజయ కుమార్ , అనిల్ కుమార్ , సంపత్ రావు , ఏడీఈ రణధీర్ రెడ్డి , సుధాకర్ , అనిల్ కుమార్ , ట్రాన్స్కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.





చంద్రబాబు ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. శ్రీకాకుళం డయేరియా ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. తాగునీటి వనరుల పరిశుభ్రత, క్లోరినేషన్, మురుగునీటి నిర్వహణలో తక్షణ చర్యలు చేపట్టాలి. ప్రజల ఆరోగ్యం కాపాడటంలో ప్రభుత్వం విఫలమైతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.
- ఏపీ మాజీ సీఎం జగన్



కలెక్టర్‌కు జర్నలిస్టు నాయకుల వినతి

ప్రతి పక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 24 : హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట డెస్క్ జర్నలిస్టులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డెస్క్ జర్నలిస్ట్ లతో పాటు అన్ని విభాగాల్లో అక్రిడిటేషన్ కార్డులు తగ్గింపు చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలు ఆందోళనలు పిలుపునిచ్చాయి. అందులో భాగంగానే హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో డెస్క్ జర్నలిస్ట్ లతో పాటుగా మిగతా యూనియన్ ల నాయకులు పాల్గొని తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. అనంతరం డెస్క్ జర్నలిస్టులకు గతంలో వలే అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ స్నేహ శబరీష్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, బిఆర్ లెనిన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, మస్కపురి సుధాకర్, రాజ్ కుమార్,టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్,గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు,మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గడ్డం కేశవ మూర్తి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, డెస్క్ జర్నలిస్టులు శంకేషి శంకర్ రావు, సిహెచ్ సోమనర్సయ్య, వర్దెల్లి లింగయ్య, అల్లం రాజేష్ వర్మ, నాయకులు కోరుకొప్పుల నరేందర్, బోల్ల అమర్, బొడిగె శ్రీనువాస్, సంపత్ రావు, కిరణ్ రెడ్డి,పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, ఎం.సుధాకర్, శ్రీకాంత్, వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయం





టెన్త్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి

- కలెక్టర్ కె హైమావతి
- మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు
- 82 సెంటర్ల ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ కె హైమావతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 24 : సిద్దిపేట జిల్లాలో పదవ తరగతి పరీక్షలు అత్యంత పారదర్శకంగా పగడ్బందిగా నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు 2026 నిర్వహణ గురించి చీఫ్ సూపరిడెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్స్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో మార్చి 14 వ తేదీ నుండి ఏప్రిల్ 16 వ తేదీ వరకు 82 సెంటర్ లో పదవ తరగతి పరీక్షల నిర్వహిస్తున్నట్లు జిల్లాలో మొత్తం 15358 విద్యార్థులు అందులో బాలురు 7700, బాలికలు 7637, తో పాటు ప్రవేట్ విద్యార్థులు 21 పరీక్ష రాయనున్నారు. నిర్వహణ కోసం చీఫ్ సూపరిడెంట్ 82, డిపార్ట్మెంట్ ఆఫీసర్ లు 82, కస్టోడియన్స్ ఆఫీసర్ లు 9 నియమించినట్లు తెలిపారు.82 కేంద్రాల్లో వాష్ రూమ్స్ క్లీనింగ్, డ్రింకింగ్ వాటర్ సౌకర్యం, సెంటర్ లో ఏఎన్ఎం మెడికల్ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చీఫ్ సూపరిడెంట్లు మీరు విధులు నిర్వహించే సెంటర్ లో అన్ని వసతులు ఉన్నాయని చెక్ చేసుకోవాలని సీసీ కెమెరాలు తప్పనిసరి, అన్ని గదుల్లో వెలుతురు వచ్చేలా ట్యూబ్ లైట్లు ఆమర్చుకోవాలని, పర్నిచర్ కొరత లేకుండా చూసుకోవాలని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో నుండి సెంటర్ వచ్చేందుకు బస్సు సౌకర్యం కల్పించి పరీక్ష సమయానికి గంట ముందే సెంటర్ కి చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.ఏ సెంటర్ లో సైతం మాల్ ప్రాక్టీస్ జరగకుండా పగడ్బందిగా ఏర్పాట్లు చెయ్యాలని తెలిపారు. సెంటర్ పరీక్ష నిర్వహించే పూర్తి బాధ్యత చీఫ్ సూపరిడెంట్ మాత్రమే అని పరీక్ష నిర్వహించే ఇన్విజిలేటర్ కు శిక్షణ అందించాలని తెలిపారు.జిల్లాలో పరీక్ష పత్రాలను స్ట్రాంగ్ రూమ్ నుండి సెంటర్ లకు, పరీక్ష పూర్తయ్యాక పేపర్ లను పోలీస్ అధికారుల సమక్షంలో ఎస్కార్ట్ సహాయంతో తీసుకెళ్లాలని తెలిపారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు 2026 బోర్డ్ ప్రతి రూమ్ లో పరీక్ష రాసే విద్యార్థులు కు సమయం తెలపాలని సెంటర్ కి పరీక్ష సమయానికి కంటే 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు మినహాయింపు కల్పించినట్లు తెలిపారు.అందరూ అధికారులు సమన్వయంతో పనిచేసి విధులు ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విద్యార్థులు ప్రశాంత వాతావరణం లో విజయ వంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ప్రతి పరీక్ష కి నిర్వహణ 3, 4 రోజుల గ్యాబ్ ఉన్నందున చదువుకోడానికి స్కూల్ కి వచ్చే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.ఫ్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ ప్రక్రియ సైతం వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. పిఎం శ్రీ లో ఎంపిక చేసిన పాఠశాలలో మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సెక్టోరల్ అధికారి రామస్వామి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఆల్ ది బెస్ట్..

- మాజీ మంత్రి హరీశ్‌రావు



ప్రతిపక్షం బ్యూరోచ, సిద్దిపేట, పిబ్రవరి 24 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు రాసే సిద్దిపేట జిల్లా విద్యార్థిని, విద్యార్థులకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు ఆల్ ది బెస్ట్ చెప్పారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థిని విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాయాలని మీరు కష్టపడి చదివిన దాన్ని ఇష్టంతో రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరుకుంటున్నాను అని మీ మంచి భవిష్యత్తు కి ఇది పునాది లాంటిదని పరీక్షలు బాగా రాసి మీ తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి వారి కలలను నిజం చేయాలని ఆకాంక్షించారు. అదే విధంగా మంచి ఉత్తీర్ణత సాధించి తల్లి తండ్రులకు, మీ అధ్యాపకులకు మంచి పేరు తీసుకరావాలన్నారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు సదన్ మహరాజ్



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 24 : నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన దారుణ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. రెండు నెలల పసికందు బేబీ మౌనిక మృతి చెందిన ఈ సంఘటన సమాజాన్ని కలచివేసింది. ధర్మ సమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బోయిని సదన్ మహరాజ్ మాట్లాడుతూ ఈ ఘటనకు కారణమైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామ జాతరలో ఆలయంలోకి ప్రవేశం విషయంలో జరిగిన వివాదం నేపథ్యంలో బీసీ చాకలి కులానికి చెందిన కుటుంబంపై దాడి చేసి, రెండు నెలల పసికందును తొక్కి చంపడం అమానుషమని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, కన్నిరెడ్డి, కటికి నరేష్, తుకారం రెడ్డి, సతీష్‌రెడ్డి, మాధవరెడ్డి లను వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని కోరారు. పరారీలో ఉన్న నిందితులను కూడా త్వరితగతిన పట్టుకుని కోర్టు ముందు హాజరుపరచాలని డిమాండ్ చేశారు. అగ్రకుల ఆధిపత్య భావజాలంతో జరిగిన ఈ దాడిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచి, నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించకపోతే, ధర్మ సమాజ్ పార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు జరిగి బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని ప్రజలు కోరుతున్నారు.



పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో మెదక్ క్రీడాకారుల అద్భుత ప్రదర్శన

- టెన్నిస్‌లో రాథోడ్ రమేష్ హ్యాట్రిక్ రజత పతకాలు
- క్రీడాకారులను అభినందించిన ఎస్పీ శ్రీనివాస రావు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 24 : సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా గత వారం రోజుల పాటు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 4వ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో మెదక్ జిల్లా పోలీసు క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి ఆరు రజత పతకాలు సాధించారు.ఈ పోటీల్లో రాథోడ్ రమేష్ టెన్నిస్ సింగిల్స్, టెన్నిస్ డబుల్స్ మరియు గ్రూప్ ఈవెంట్‌లలో పాల్గొని మూడు రజత పతకాలు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు పతకాలు సాధించిన క్రీడాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ..క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గెలుపోటములు సహజమని, విజేతలు జాతీయ స్థాయిలో మరింత మెరుగైన ప్రదర్శన కోసం కృషి చేయాలని సూచించారు. అలాగే ఓటమి చెందిన క్రీడాకారులు నిరాశ చెందకుండా తమ లోపాలను సరిదిద్దుకొని ముందుకు సాగాలని ప్రోత్సహించారు.జిల్లాకు పతకాలు తీసుకొచ్చిన క్రీడాకారులందరినీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డియస్పి రంగనాథ్,ఆర్ఐ లు శైలందర్, రామకృష్ణ, ఆర్ఎస్ఐ మహిపాల్ ,సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలిసిన ఐపీఎస్ శిక్షణాధికారి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 24 : సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఐపిఎస్ శిక్షణాధికారి ఏంఎస్. అయేషా ఫాతిమా జిల్లా కలెక్టర్ కె.హైమావతిను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని శాంతి భద్రతల అంశాలపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని, స్థానిక పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని శిక్షణ ఐపిఎస్ అధికారికి సూచించారు. ప్రజల సమస్యలు, చట్టంవ్యవస్థ నిర్వహణలో ఉన్న సవాళ్లు, పోలీసుప్రజల అనుసంధానం వంటి విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. శిక్షణ కాలాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని, జిల్లాలోని పరిపాలనా విధానాలను అవగాహన చేసుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.



రఘునందన్ రావును విమర్శిస్తే ఊరుకోం..

- రైల్వే బోర్డు మెంబర్ పుట్ట వంశి ముదిరాజ్

ప్రతి పక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 25 : మెదక్ ఎంపీ రఘునందన్ రావు ను విమర్శిస్తే చూస్తూ ఊర్కోం అని జిల్లా రైల్వే బోర్డు మెంబర్ పుట్ట వంశి తెలిపారు. మంగళవారం దుబ్బాక లో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులం పేరుతో రాజకీయం చేస్తున్న నీలం మధు నీ చరిత్ర, నీ భాగోతం, నీ భూకబ్జా దందాలు ప్రజలకు తెలియనివి కావన్నారు. నీ భూకబ్జా దంధాలను కాపాడుకోవడానికి ముదిరాజ్ కులాన్ని అడ్డం పెట్టుకొని ఎం పి రఘునందన్ రావు ను విమర్శించటం సిగ్గు చేటు అన్నారు. నిజంగా నీకు ముదిరాజ్ ల పట్ల చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ముదిరాజులకు ఏం పనులు చేసినవో ఒకసారి సమాధానం చెప్పాలని హితవు పలికారు. ముదిరాజ్ కులాన్ని అడ్డం పెట్టుకొని నీచ రాజకీయాలు చేస్తూ నీ అనుచరులతో ఎం పి రఘునందన్ రావు దిష్టిబొమ్మలు దగ్ధం చేయించడం ఇకనైనా మానుకోవాలని హెచ్చరించారు. ఎం పి పార్లమెంటు పరిధిలో గల మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎక్స్ అఫీషియో ఓటు ఒక బీసీ బిడ్డకు రఘునందన్ రావు ఓటు వేసిన సంగతి గుర్తుంచుకొని మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, బీజేపీ నాయకులు కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , దేవుని ఉపేందర్ ముదిరాజ్ , అంజి ముదిరాజ్, పల్లె నేహాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మాజీపేట పాఠశాల విద్యార్థులు

ప్రతి పక్షం దుబ్బాక ఫిబ్రవరి 24: సీఎం కప్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ధర్మాజీపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వి శైలజ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.ఈనెల 12 న సిద్ధిపేటలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన జీడిపల్లి అభినవ్, మాచవేణి ప్రణయ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు . ఈనెల 20వ తేదీ నుండి హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొని, సెమీ ఫైనల్ వెళ్లడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధర్మాజీపేట విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి రవీందర్ , మండల విద్యాధికారి జోగు ప్రభుదాసు లు ప్రత్యేకంగా అభినందించారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు మహమ్మద్ సాదత్ అలీ, పల్లె శ్రీనివాస్ గౌడ్ , కె. వెంకట కృష్ణమాచారి, ఆర్ శ్రీనివాస్ రెడ్డి, కె .శ్రీకాంత్, పి. బాలకృష్ణ, ఆర్. పద్మావతి , యం. అశోక్, ఎస్. దినేష్, సిహెచ్. చంద్రశేఖర్ , బి. రాజేందర్, ఏ.రేణుక , సి ఆర్ పి టి.నవీన్ కుమార్ లు అభినందించారు.





రామంచ పాఠశాల ఆదర్శనీయం

- తల్లిదండ్రుల సహకారం అభినందనీయం
- దాతల దాతృత్వం ఎనలేనిది
- క్యాలెండర్ ఆవిష్కరణలో ఎంఈఓ తిరుపతి

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 24: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థుల అవసరాలను తీర్చడంలో రామంచ ప్రాథమిక పాఠశాల అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నదని చిన్నకోడూరు మండల విద్యాధికారి పాశికంటి తిరుపతి అన్నారు. మంగళవారం మండలంలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో దాత కొమ్ము ప్రశాంత్ అందించిన రూ.6500ల ఆర్థిక సహాయంతో సమకూర్చిన పాఠశాల క్యాలెండర్ ను, సర్పంచ్ భవాని నవీన్ కుమార్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.వి. సురేశ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఈవో తిరుపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామంచ పాఠశాలలో ప్రతి నెలా ఏదో ఒక ప్రత్యేక కార్యక్రమం జరగడం, ఆ కార్యక్రమం విద్యార్థులకు ఉపయోగపడేది కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రైవేటు పాఠశాలల కంటే వినూత్న తరహాలో వివిధ కార్యక్రమాలు ఈ పాఠశాలలో జరుగుతాయన్నారు. ఇప్పటివరకు తాను ఇలాంటి క్యాలెండర్ ను ఏ పాఠశాలలో చూడలేదన్నారు. విద్యార్థులు అన్ని విషయాలలో బాగా రాణిస్తున్నారన్నారు. పాఠశాలలో ఏ కార్యక్రమం జరిగినా తల్లిదండ్రుల భాగస్వామ్యం బాగుందన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలందరూ చదివేలా గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. చదువు అన్నింటి కంటే ఎంతో విలువైనదని, పిల్లలందరూ ప్రతి రోజు బడికి వచ్చి చదువుకునేందుకు సహకరించాలన్నారు. దాతలు పాఠశాల విద్యార్థుల అభ్యున్నతికి చేయూత అందించేందుకు ముందుకు రావడం శుభ పరిణామం అన్నారు. సర్పంచ్ భవాని నవీన్ కుమార్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి తాను సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పావని తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు భారతమ్మ, సంతోష, కనకరాజు, దాత కొమ్ము ప్రశాంత్, ఉపాధ్యాయులు సునీత, ఆబేదాబేగం, నాగమణి, వరప్రసాద్, యాదయ్య, స్వరూప లతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలను పకడ్బందీ నిర్వహించాలి

- రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి24 : ఇంటర్, 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రామకృష్ణరావు అన్నారు. మంగళవారం రాష్ట సచివాలయం నుండి ఇంటర్ 10వ. తరగతి పరిక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్ పి లు, విద్యాశాఖ అధికారులు, వైద్యశాఖ అధికారులు,ఆర్ టి సి అధికారులు, విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి కార్యదర్శులు, కమిషనర్లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ... ఈ నెల 25 నుండి మార్చి 18 వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరిక్షలు వుంటాయని, 10వ. తరగతి వార్షిక పరిక్షలు, మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు ఉంటాయని, ప్రతి పరిక్ష కేంద్రంలో త్రాగునీరు, పారిశుద్యం, వెలుతురు, సరిపడా పర్నిచర్ వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిక్ష కేంద్రం వద్ద మెడికల్ క్యాంపు, పోలీస్ బందోబస్తు, ప్రశ్న ,జవాబు పత్రాలను పోలీస్ బందోబస్తు మద్య పరిక్ష కేంద్రాలకు తరలించాలన్నారు. విద్యార్థులు పరిక్ష సమయానికి చేరుకునేలా, ఆర్ టి సి అధికారులు బస్సులు నడపాలన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత మెడికల్ పోలీస్, ఆర్టీసీ, ట్రెజరీ, పోస్టల్ డిపార్ట్మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, ఇతర అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. ఆర్థిక పరిస్థితి వల్ల సమస్యలు ఒక్కటొక్కటిగా పరిష్కరిస్తున్నాం. మీ కుటుంబ సభ్యుడిగా నా ఆఫీసు డోర్స్ ఎల్లవేళలా తెరిచే ఉంటాయి. ఏ సమస్య అయినా చెప్పవచ్చు. అన్నిటినీ చర్చిద్దాం. ఆందోళనలు, నిరసనలు లేకుండా సంస్థను కాపాడుకుందాం. కార్మిక సంక్షేమం, సంస్థ పురోగతికి కలిసి పనిచేద్దాం.

- మంత్రి పొన్నం ప్రభాకర్



కళాకారుల సంక్షేమ సంఘం క్యాలెండర్ విడుదల

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 24: గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం కళాకారుల సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం నాడు గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి సమక్షంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో కళాకారులకు ప్రత్యేక గుర్తింపు తోపాటు పింఛన్లను మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకుందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు శ్యాంసుందర్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, స్వప్న, ప్రధాన కార్యదర్శి సిద్దులు, కోశాధికారి కనకయ్య, ప్రకాష్, యాదగిరి, రత్నం, హరిప్రసాద్, బిక్షపతి, నర్సింలు, శైలజ, పద్మ, మమత, శశి ప్రియ, చామంతి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

- జిల్లా ఎస్పీ డి.వి శ్రీనివాస రావు



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి24 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా సెక్షన్ 163 BNSS (144 సెక్షన్) అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మెదక్ జిల్లా పరిధిలోని మొత్తం 28 ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల్లో 12,334 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. ఈ పరీక్షలు తేది: 25022026నుండి 18032026 వరకు, ప్రతిరోజూ ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని ఎస్పీ తెలిపారు. పరీక్ష కేంద్రాల నుండి 200 మీటర్ల పరిధి లోని అన్ని జిరాక్స్ కేంద్రాలు 25022026 నుండి 18032026 వరకు,ప్రతిరోజూ ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00గంటల వరకు మూసివేయాలని ఆదేశించారు.

విద్యార్థులకు సూచనలు

పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు పరీక్ష సమయానికి కనీసం అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.పరీక్ష కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని, కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ప్రశ్నాపత్రాల రవాణాకు ప్రత్యేక ఎస్కార్ట్ ఏర్పాటు చేశామని, పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసి, ఎలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.



గౌడ సంఘం ఆధ్వర్యంలో సన్మానం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 24 : మెదక్ పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్ దొంతి లక్ష్మీలను సన్మానించారు మంగళవారం మెదక్ పట్టణంలోని రేణుక మాత ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ దొంతి లక్ష్మీలను ఘనంగా శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో.గౌడ సంఘం అధ్యక్షులు మంగ రమేష్ గౌడ్, ఆలయ అధ్యక్షులు అరేళ్ళ విద్యాదర్ గౌడ్, మాజీ ఆలయ అధ్యక్షులు కొండన్ సురేందర్ గౌడ్, ఆలయ అర్చకులు వేదవ్యాస్, సంఘం బాద్యులు మంగ అశోక్ గౌడ్,గూడూరి ఆంజనేయులు గౌడ్, దయారా నర్సింలు గౌడ్,వెంకట్ గౌడ్, నాగరాజు గౌడ్, కొండల్ గౌడ్, విక్రమ్ గౌడ్, కుమార్ గౌడ్, సాయా గౌడ్ తదితరులు ఉన్నారు.

సిటిజన్ ఫోరమ్ ఆధ్వర్యంలో వైస్ చైర్మన్‌కి ఘనంగా సన్మానం



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 24 : మెదక్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ను. కౌన్సిలర్ దొంతి లక్ష్మి ముత్యం గౌడ్ ను ఘనంగా సన్మానించారు సందర్భంగా సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొండల్ రెడ్డి మాట్లాడుతూ. పట్టణ సమస్యలు పరిష్కారం కొరకు నిత్యం కృషి చేయాలని ఆయన తెలిపారు ముఖ్యంగా తాగునీటి వ్యవస్థను మెరుగుపరచాలని కాలనీలలో మురికి కాలువల నిర్మాణం సిసి రోడ్ల నిర్మాణం చేయాలని చిల్డ్రన్ పార్క్ ను అభివృద్ధి లోకి తేవాలని వివిధ సమస్యలను ఆయనకు వివరించారు ఈ కార్యక్రమంలో సిటిజన్ ఫోరం సభ్యులు యాచం నాగభూషణం. భూపాల్ రెడ్డి.పి డి ఆనందం. దయాసాగర్.బాలేష్ గౌడ్, , జీవరత్నం, నరసింహులు గౌడ్, దశరథం, నాగభూషణం, భుజంగరెడ్డి ,రాజశేఖర్, రామచంద్రం,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాటు పూర్తి

- జిల్లా కలెక్టర్ హైమవతి
- 42 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 24 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ కే.హైమావతి తెలిపారు. ఈనెల 25వ తేదీ నుండి ఏప్రిల్ 18వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లపై మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత శాఖలో ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులతో సమీక్షించి తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 9946 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 10089 మంది మొత్తం 20035 మంది పరీక్షలకు హాజరుకానుండగా 42 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లాలో ఎలాంటి ఆవంచనీయ సంఘటన జరగకుండా ఇంటర్మీడియట్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహిస్తామని తెలియజేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఈ నెల 25వ తేది నుంచి వచ్చే నెల (మార్చి) 18వ తేదీ వరకు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహిస్తారని వివరించారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పరీక్షలు సజావుగా కొనసాగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. ముఖ్యంగా పరీక్షలు సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా, నిరంతరం విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు, అలాగే పరీక్ష కేంద్రాల వద్ద ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, తగినన్ని మందులు నిల్వ పెట్టాలని వైద్య అధికారులకు సూచించారు, అవసరమైన పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను, పరీక్షా కేంద్రాల వద్ద 163 BNS సెక్షన్ ఏర్పాటు చేయాలని, అలాగే పరీక్షలు కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులను మూసి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు, వేసవి దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన త్రాగునీరు సమకూర్చి, కేంద్రాల పరసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు, పరీక్ష సమయానికి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాలని, పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లను అనుమతించరాదని ఆదేశించారు.అలాగే విద్యార్దులు నిర్దేశించిన సమయంలోపు పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్దులు మానసికంగా ఒత్తిడికి గురైతే , ఒత్తిడిని తట్టుకొని ప్రశాంతంగా పరీక్షలు వ్రాసేవిధంగా టేలి మానస్ నెం: 14416కి ఫోన్ చేస్తే నిపునులు కౌన్సిలింగ్ ల ఇస్తారన్నారు .విద్యార్దులు సమస్యలను నివృత్తి చేసుకోనుటకు కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెం: 9949330191 కి ఫోన్ చేయవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో శిక్షణ ఐపిఎస్ ఆయేషా ఫాతిమా, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ధనరాజ్, డిపిఓ రవీందర్, ఆర్టీసీ, రవాణా తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ విద్యార్థులకు శుభాశీస్సులు



- – మెదక్ ఎంపీ మాధవనేని
- రఘునందన్ రావు.

ప్రతిపక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 24 : నేటి నుండి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు వ్రాసే ఉమ్మడి మెదక్ జిల్లా విద్యార్థిని, విద్యార్థులకు ఎం పి రఘునందన్ రావు ఆల్ ది బెస్ట్ చెప్పారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థిని విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాయాలని మీరు కష్టపడి చదివిన దాన్ని ఇష్టంతో రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరుకుంటున్నాను అని, మీ మంచి భవిష్యత్తు కి ఇది పునాది లాంటిదని, పరీక్షలు బాగా రాసి మీ తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి వారి కలలను నిజం చేయాలని ఆకాంక్షించారు.అదే విధంగా మంచి ఉత్తీర్ణత సాధించి తల్లి తండ్రులకు, మీ అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.





బస్తీ దవాఖానను పరిశీలించిన మున్సిపల్ వైస్ చైర్ పర్సన్

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 24 : మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో గల బస్తీ దవాఖాన, అంగన్వాడీ కేంద్రాన్ని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కళ్యాణ్ కార్ పద్మా బాయ్ నర్సింగరావు మంగళవారం రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా దవాఖానలో అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ దవాఖానకు వచ్చే రోగుల సంఖ్య ఎంత? ఏయే రకమైన వ్యాధులతో ప్రజలు ఎక్కువగా వస్తున్నారు? అన్న వివరాలను వైద్యులను అడిగి ఆరా తీశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ చిన్నారులకు అందుతున్న పౌష్టికాహార నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, బస్తీ దవాఖానలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 24 : సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ మీటింగ్ జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో యువత కి ఉద్యోగ ఉపాధి అందించడం కోసం పరిశ్రమలు స్థాపన ముఖ్యమైనదని, టీజీ ఐ పాస్ లో వివిధ పరిశ్రమలు నెలకొల్పడానికి దరఖాస్తు పెట్టుకున్న అన్ని ఆయా డిపార్ట్మెంట్ వారిగా క్షేత్రస్థాయిలో వెరిఫై చెయ్యాలని ఒకవేళ యూనిట్ నెలకొల్పడానికి సుముఖంగా లేనియెడల డిలీట్ చెయ్యాలని తెలిపారు.ఈ కమిటీలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గణేష్ రామ్, ఎల్డిఎం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 24 : మెదక్ మండలం పరిధిలోని గుట్టకిందిపల్లి ప్రాథమిక పాఠశాల లో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారిగా ధనుష్, మండల విద్యాధికారిగా ప్రతిష్, హెడ్మాస్టర్ గా హర్షిని ఉపాధ్యాయులుగా జోష్ణవి, మనస్విని, వర్షిని,హర్షవర్ధన్, దీపక్,నిఖిల్ వ్యవహరించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు బోధన చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ కుమార్, ఉపాధ్యాయురాలు స్రవంతి, సరిత లు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



నష్టపోయిన రైతులను ఆదుకుంటాం!

- -దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం,తొగుట, ఫిబ్రవరి 24 తొగుట మండలంలోని ఎల్లారెడ్డిపేట,ఘనపూర్ గ్రామలలో నిన్న కురిసిన అకాల వర్షానికి పంట నష్టం అంచనా వేయడానికి జిల్లా వ్యవసాయ ఆఫీసర్ స్వరూప రాణి తో కలిసి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పర్యటించి నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని అన్నారు. రైతులు అధైర్య పడవద్దు అని పంట నష్టం అంచనా కొరకు ADA మల్లయ్య,Ao మోహన్,Aeo ల ద్వారా నష్టపోయిన రైతులు నమోదు చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి గారు,AMC మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్) ,మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి ,సర్పంచ్లు ఫోరం అధ్యక్షులు పిట్ల సత్తయ్య, గౌరవ సర్పంచ్లు, రాంపురం రమేష్,చిక్కుడు కళావతి స్వామి,లాచోళ్ళ రవీందర్,ఆత్మ కమిటీ డైరెక్టర్లు సంతోష్,ప్రవీణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చందా సత్తయ్య, సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి,నిరంజన్ రెడ్డి,పంది రాజు,రమేష్ గౌడ్,భూపాల్ రెడ్డి,రేపాక తిరుపతి, దేవునూరి పోచయ్య, కనికి స్వామి, ఉపలెయ్య,ముకెర కనకయ్య,భారత్ మాజీ సర్పంచ్ నర్సింలు,తేజ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు హయాంలోనే నెయ్యి కల్తీకి పునాదులు పడ్డాయి. అసెంబ్లీలో చంద్రబాబు పచ్చి అబద్ధాలాడారు. బోలే బాబా, ఇందాపూర్ డెయిరీలను బాబు ప్రభుత్వమే తీసుకొచ్చింది. నా కుమార్తె పెళ్లిని హిందూ సంప్రదాయంలో జరిపించాను. దానికి బాబు వియ్యంకుడు బాలకృష్ణ, తమ్ముడు రామ్మూర్తి వచ్చారు. ఏడు కొండలు జీఓ ఇచ్చింది వైఎస్సార్. దాన్ని రద్దు చేస్తానని ఎన్నికల్లో చెప్పింది టీడీపీ ప్రభుత్వమే.
- టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి



అన్ని వ్యవహారాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు

- ప్రధాని మోడీపై మండిపడ్డ రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, భోపాల్, ఫిబ్రవరి 24: ఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో నిరసన చేపట్టిన భారత యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మంగళవారం పూర్తి మద్దతు నిచ్చారు. యూత్ కాంగ్రెస్ నేతలను 'బబ్బర్ షేర్స్' అని అభివర్ణించారు. ఐవైసీ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను నాలుగు రోజుల పోలీసు కస్టడీకి పంపన నేపథ్యంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని రాహుల్ అన్నారు. భోపాల్‌లోని కాంగ్రెస్ కిసాన్ మహాచౌపాల్‌ను ఉద్దేశించి రాహుల్ మాట్లాడుతూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. మరోవైపు యుద్ధ నిర్ణయాల నుంచి అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వరకు అన్ని అంశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశ భద్రత, రైతుల ప్రయోజనాలు, పార్లమెంటరీ వ్యవస్థ అన్నీ ప్రమాదంలో పడుతున్నాయని అన్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ వేదికగా జరిగిన రైతు మహాచౌపాల్ సభలో పాల్గొన్న రాహుల్, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే తన పుస్తకంలోని చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన రాహుల్, చైనా ట్యాంకులు సరిహద్దుల్లోకి వచ్చినప్పుడు ఆదేశాల కోసం రక్షణ మంత్రికి ఫోన్ చేసినా స్పందన రాలేదని నరవణే రాశారని చెప్పారు. ఇక ఇండో- యూఎస్ ట్రేడ్ ఒప్పందంపై కూడా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాతో కుదిరిన ఈ ఒప్పందం రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకమని, వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా ఉందని చెప్పారు. ఐదు నెలల పాటు వ్యవసాయ ఉత్పత్తుల అంశం కారణంగా ఈ ఒప్పందం నిలిచిపోయిందని, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రభుత్వం కూడా అంగీకరించలేదని పేర్కొన్నారు.

విశ్వ వీక్షణం



త్వరలో బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్

- 14 యేండ్లు దాటిన వారికి ఉచితంగా పంపిణీ
- వెల్లడించిన కేంద్ర ఆరోగ్య శాఖ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ నివారణకు త్వరలో దేశవ్యాప్తంగా యుక్త వయసు బాలికలందరికీ హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్‌ను పంపిణీ చేయనున్నారు. రెండేండ్ల క్రితం కేంద్ర బడ్జెట్ లో చేసిన వాగ్దానాన్ని ఈ ఏడాది అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రత్యేక టీకాను 14 ఏండ్లు దాటిన బాలికలకు ఉచితంగా అందించనున్నట్టు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. 2027 నాటికి దేశవ్యాప్తంగా 2.6 కోట్ల డోస్‌లను పంపిణీ చేయనున్నట్టు తెలిపింది. వ్యాక్సిన్ కూటమి 'గావి' ఒక కోటి డోసులను భారత్‌కు సరఫరా చేయనున్నదని అధికారులు పేర్కొన్నారు. మెర్క్ కంపెనీ ఉత్పత్తి చేసిన గర్డాసిల్ టీకాను బాలికలకు వేయనున్నట్టు తెలిపారు. ఈ వ్యాక్సిన్ నాలుగు రకాల గర్భాశయ క్యాన్సర్లను నిరోధిస్తుంది. ఒక డోసుతో బాలికలకు సంబంధిత వైరస్‌ల నుంచి దీర్ఘకాల రక్షణ లభిస్తుందని పలు పరిశోధనల్లో తేలింది. ప్రస్తుతం మార్కెట్ లో ఉన్న గర్డాసిల్ టీకా ధర ఒక డోసు రూ.3,927. పదిహేనేండ్ల లోపు బాలికలు రెండు డోసులు, 15 ఏండ్లు దాటిన వారు మూడు డోసులు తీసుకోవాల్సి ఉంటుంది. తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ కుమార్తెలకు ఈ వ్యాక్సిన్‌ను ఇప్పించాలని కేంద్ర ఆరోగ్య శాఖ అధికారులు సూచించారు.

సింగిడి
హైదరాబాద్
బుధవారం
25.02.2026
9
ప్రతిపక్షం
Prathipaksham.in



ఈ మీ అన్వేషణ దేనికోసం..

అన్వేషణ అనేది ఒక సాహసకృత్యం.. జ్ఞాన సముపార్జన.. జీవిత పోరాటం.. జీవితంలో అతి ముఖ్యమైన అంతర్భాగం. ప్రతి ప్రాణికి తప్పనిది, తప్పించుకోలేనిది అన్వేషణ. అయితే దీనిలో స్థాయీభేదముంటుంది. దీన్నే దృష్టి అంటాం. ఇది ఎవరి కెలా ఉంటుందనేది వారి వారి జీవిత నేపథ్యం, భౌగోళిక, సామాజికాంశాలతో పాటు చదువుల సారం మీద కూడా ఆధారపడుతుంది. హృదయ సంస్కారం కూడా అన్వేషణలో చేర్చే ముఖ్యాంశమే..

మానవ సమూహాల సంఖ్య పెరిగిన కొద్దీ అహార వసరాలు పెరిగాయి. నివాసాల అవసరాలు వచ్చాయి. ఇది వ్యవసాయానికి, ఇళ్ల నిర్మాణానికి దారి తీసాయి. మనిషిభయం, అవసరం అతడిని కొత్త మార్గాలను, పద్ధతులను కనిపెట్టేటట్టు చేసింది. చేస్తూనే ఉంటుంది. ఇది మనిషికి ఉన్న ఆలోచనా శక్తి వల్ల వచ్చింది. మనిషికున్న ఈ అన్వేషణా మేధ ఎప్పటికప్పుడు నూతన ఒరవళ్ళకు శ్రీకారం చుడుతూనే ఉంటుంది.

అన్వేషణను ప్రేరేపించే అంశాలలో మొట్టమొదటిది 'అవసరం'. రెండవది 'ఆసక్తి లేదా 'జిజ్ఞాస.' మనిషికి ఉత్సుకత ఉండాలి. ఇది ప్రశ్నించేలా చేస్తుంది. ప్రతిదాన్నీ నిశితంగా, లోతుగా చూసే చూపునిస్తుంది. అది ప్రకృతి పరమైనది కావచ్చు. లేదా ఆత్మానుగతమైనదీ కావచ్చు. ఒక శాస్త్రవేత్త, ఒక సిద్ధార్థుడు దీనికి మనకు గొప్ప నిదర్శనంగా నిలుస్తారు. మన ఉనికికి భౌతికరూపమైన ఈ శరీరాన్ని పోషించుకునేందుకు అవసరమైన ఆహారాన్ని సంపాదించుకునే యత్నంతో అన్వేషణ ప్రారంభమవుతుంది. ఇది ప్రతి ఒక్కరికీ అత్యంత ఆవశ్యకమైనది. పక్షులు సైతం తమ పిల్లలకోసం ఆహారాన్ని సంపాదించి నోటిలో పెట్టటం మనం చూసే సాధారణ దృశ్యం. ఆదిమానవుడు ప్రకృతి, సూర్యోదయ, చంద్రోదయాలను, మెరుపులను ఉరుముల శబ్దాన్ని రుతు మార్పులను చూసి, జంతువులను చూసి ఎంతగానో భయపడ్డాడు. క్రమేణా భయాన్ని వీడుతూ జ్ఞానాన్ని పెంచుకుంటూ ఈ మార్పులు సహజమన్న విషయాన్ని అర్థం చేసుకున్నాడు. జీవితం నేర్పిన ఈ జ్ఞానం అతడికి ఆలోచనా శక్తినిచ్చింది. ఇదీ ఒక అన్వేషణే.. ఇది ఎంతో గొప్పదైనది. ఈ సృష్టి ఎలా ఏర్పడింది.. జీవపరిణామం ఏమిటన్నది ఒకరి ఆలోచన అయితే, మరొకరిది ఈ సృష్టిలో మనిషి అస్తిత్వమేమిటి, చావు పుట్టుకల చక్రం నుండి బయటపడేదెలా అన్న ఆలోచనమరొకరిది. మార్గాలేవేరు అంతే. ఇద్దరూ మేధోమథనం చేసేవారే. ఇరువురూ జ్ఞానసాధకులే, సత్యశోధకులే. సామాన్యులకు అర్థం కాని, తట్టని జీవిత రహస్యాలను విడమరచి చెప్పే మాన్యులే.

ఈ అన్వేషణా శక్తి సహజాతం కానప్పుడు అలవరచుకోవటం కష్టం. ఎవరైతే ఆ శక్తి లేదనుకుంటారో వారు ప్రయత్నం చెయ్యాలి. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని పరిశీలనగా చూడాలి. మనుషుల ప్రవర్తనను గమనిస్తూ విశ్లేషణ చేసుకోవాలి. ఈ అన్వేషణ అనే లోతైన సముద్రంలో తార్కికత, గొప్ప అవగాహనా శక్తి, కఠోర శ్రమలతోపాటు గొప్ప జిజ్ఞాస తోడు చేసుకుని ఈదగలిగితే రత్నాలు.. మణులు, మాణిక్యాలు దొరుకుతాయి. అయితే, ఇంతటి సాధన.. శోధన కొందరికే సాధ్యమవుతుంది. అలాంటి వారికే జగతి జేజేలు పలుకుతుంది. అన్వేషణకు మార్గమే కాదు లక్ష్యం కూడా సరైనదిగా ఉండాలి. వక్రమార్గంలో స్వార్థ పూరితంగా చేసే అన్వేషణ ప్రపంచానికి ఏ ప్రయోజనాన్నీ ఇవ్వకపోగా చేటు చేస్తుంది. వ్యక్తికైనా, సమాజానికైనా, దేశానికైనా, పరశువేది, అమృతం గురించి అన్వేషించిన వాళ్ళ జీవితాలు ఎలా వృథా అయ్యాయో చరిత్ర చెప్పకనే చెప్పింది. కొన్ని దేశాలు చేసే ప్రయోగాలు, శాస్త్ర పరిశోధనలు మానవాళికెంత హాని కలిగించాయో మనకు తెలుసు. అందుకనే అన్వేషణకు ఉత్తమ లక్ష్యం ఉండాలి. అప్పుడే ఉత్తమ సాధనాపథం అమరుతుంది. ఉత్తమ సాహిత్యం చదువుతున్నప్పుడు ఈ అన్వేషణ అనే వివేచనా నయనం అవసరం. అప్పుడే ఆ కవి లేదా రచయిత సృజనలోని విశిష్టతను పసిగట్టగలం. ఆ కావ్యంలోని భాషా సొబగులను.. కవి భావనా పటిమను, కవి చూసిన సాహితీ లోతులను.. ఆ కావ్యప్రయోజనాన్ని అర్థం చేసుకోగలం. లోపాలను చూడగలిగే విమర్శనాశక్తికి ఈ అన్వేషణ గొప్ప సాధనమవుతుంది.అన్వేషణ అంటే కొందరి భావన కొత్త ప్రదేశాలను సందర్శించటం, కొత్త వ్యక్తులను కలవటం. వారి సంస్కృతిని దాని గొప్పదనాన్ని చూడగలగటం. అనుసరణ యోగ్యమైతే స్వీకరించటం. రక్త సంబంధీకులు, స్నేహితులు, హితులు, శ్రేయోభిలాషులు, ఇరుగుపొరుగు, ముఖ పరిచయం కలవారు... ఇలా అనేకమందితో సాగేదే మన ఈ జీవితనౌక. దీనిలో మనతో, మన భావాలతో, మన ధోరణితో ఒదిగి మనతో ఎక్కువకాలం పయనించగలిగే వారి కోసం మనం అన్వేషించాలి. మనకు కష్టం కలిగినవేళ నేనున్నాననే వారి చేతి స్పర్శ, బాధపడే సమయాన మనకొరకు చెమ్మగిల్ల గల నయనం, మనం తలను వాల్చేటందుకు ఒక భుజం, మనం తలవాల్చ గల ఎద మనకు కావాలి. ఒక సహచర్యం ప్రతి ఒక్కరికీ అవసరం. అందుకోసం ప్రతి ఒక్కరూ వెతకాలి.

ఆస్తికులకి అన్వేషణ అంటే ఆత్మ శోధన. ఆత్మతత్త్వమేమిటో తెలుసుకోవాలనే తపన.. జీవాత్మ, పరమాత్మల సంబంధం, సంలీనం కోసం ఆరాటం. నాస్తికులకు, మానవతా వాదులకు మాధవ సేవ కన్నా మానవ సేవ ముఖ్యం. అన్నార్తుల, బాధార్తుల, అనాథలను ఆదుకోవాలనే తపన వీరిది. ఇది కూడా ఒక విధమైన అన్వేషణే.. ఇది కూడా అలవర చుకోవలసిన అన్వేషణమే.

విద్యను గరిపే గురువులకు అన్వేషణాశక్తి ఎంత అవసరమో దానిని నేర్చుకునే విద్యార్థులకు అది అంతే ఆవశ్యకం. గురువు తన జ్ఞానాన్ని నిత్య వసంతం చేసుకోవాలి. క్లిష్టమైన అంశాలను శిష్యులకు బోధించే సులభమైన పద్ధతులను వెతకాలి. శిష్యులు కూడా గురువు అందిస్తున్న జ్ఞానాన్ని తరచి చూసే అలవాటు చేసుకోవాలి. ఈ రకమైన అన్వేషణ వల్ల తాను పొందే జ్ఞాన సత్యాసత్యాలు తెలుస్తాయి. పరిశోధకులకు ఈ అన్వేషణ చాలా అవసరం. అంతవరకూ ప్రపంచం విశ్వసిస్తున్న ఒక నిజాన్ని, ఒక సిద్ధాంతాన్ని త్రోసిరాజని నిరూపణ చేసే శక్తి అన్వేషణ మనిషికిస్తుంది. అసలు నిజమేమిటో ప్రపంచానికి చాటాలంటే మనకెంతో స్థైర్యం ఉండాలి. చరిత్రను పరిశీలిస్తే ఎంతోమంది వేదాంతులు, తత్త్వవేత్తలు, సిద్ధాంతకర్తలు, శాస్త్రవేత్తలు తాము శోధించి తెలుసుకున్న సత్యాన్ని తమ ప్రాణాలను సైతం లెక్కచేయక జగతికి ప్రకటించి జగద్విఖ్యాతులై ప్రాతః స్మరణీయులయ్యారో తెలుస్తుంది.



తమిళనాడులో శశికళ కొత్త పార్టీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చెన్నై, ఫిబ్రవరి 24: తమిళనాడులో త్వరలో కొత్త పార్టీని స్థాపించనున్నట్టు మాజీ సీఎం జయలలిత సన్నిహితురాలైన శశికళ మంగళవారం ప్రకటించారు. జయలలిత జయంతి సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 'మనం రాష్ట్రంలో ఒక కొత్త రాజకీయ అధ్యాయాన్ని చూడబోతున్నాం' అని పేర్కొన్నారు. 'త్వరలోనే నేను ఆ కొత్త పార్టీ పేరు ప్రకటిస్తా. అందులో ఎలాంటి మార్పు లేదు. అది ప్రత్యర్థులను, ద్రోహులను తప్పక ఓడిస్తుంది. మనం రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయాన్ని చూడబోతున్నాం' అని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా తన పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. దానిపై ద్రవిడ నేత అన్నాదురై, ఏఐఏడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీ రామచంద్రన్, జయలలిత ఫొటోలు ఉన్నాయి. అడ్డంగా త్రివర్ణంతో ఉన్న ఆ పతాకం పై భాగంలో నలుపు, మధ్యలో తెలుపు, అడుగు భాగాన ఎరుపు రంగు ఉన్నాయి.

కేరళ.. ఇక 'కేరళమ్'

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: కేరళ రాష్ట్రం పేరును 'కేరళమ్'గా మార్చాలన్న ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి మండలి మంగళవారం ఆమోదం తెలిపింది. నూతన పీఎంఓ కాంప్లెక్స్ 'సేవా తీర్థ్'లో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 'కేంద్ర కేబినెట్ ఆమోదం పొందిన తరువాత, భారత రాష్ట్రపతి 'కేరళ పేరు మార్పు బిల్లు, 2026'ను కేరళ రాష్ట్ర శాసనసభకు పంపిస్తారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం, కేరళ రాష్ట్రం తన అభిప్రాయాన్ని తెలియజేసేందుకు ఈ ప్రక్రియను చేపడతారు. కేరళ శాసనసభ అభిప్రాయాన్ని తెలుసుకున్న తర్వాత, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి సిఫారసుతో పార్లమెంట్‌లో కేరళ పేరు మార్పు బిల్లు 2026ను ప్రవేశపెడుతుంది' అని అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి కేరళ పేరును 'కేరళం'గా మార్చాలని కోరుతూ 2024 జూన్ 24న కేరళ శాసనసభ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. "మలయాళం భాషలో రాష్ట్రం పేరు 'కేరళం'. 1956 నవంబర్ 1న భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడ్డాయి. కేరళ పిరవి దినం కూడా నవంబర్ 1నే జరుగుతుంది. వాస్తవానికి స్వాతంత్ర్య పోరాట కాలం నుంచే మలయాళం మాట్లాడే వారందరికీ కలిపి 'ఐక్య కేరళం' కావాలనే డిమాండ్ బలంగా ఉండేది. అయితే రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో మాత్రం 'కేరళ' అని నమోదు చేశారు. అందుకే ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నాం" అని 2024లో చేసిన ఆ తీర్మానంలో పేర్కొన్నారు.



బిహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం


- 10 మంది మృతి


ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పట్నా, ఫిబ్రవరి 24: బిహార్‌లోని భాగల్‌పూర్ జిల్లాలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 10 మంది వరకు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఖరీక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బగరీ వంతెన సమీపంలో నేషనల్ హైవే 31పై ఈ ప్రమాదం జరిగింది. అతివేగంగా దూసుకొచ్చిన ఒక ట్రక్కు పికప్ వ్యాన్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ సందర్భంగా పలు వాహనాలు ఒకదానికి ఒకటి తాడకంతో ప్రమాదం తీవ్రత పెరిగింది. తొలుత ట్రక్కు పికప్ వ్యాన్‌ను బలంగా ఢీకొట్టింది. ట్రక్కు తాకిడికి నియంత్రణ కోల్పోయిన పికప్ వ్యాన్, పక్కనే వెళ్తున్న ఈరిక్షాను ఢీకొట్టింది. ఈ క్రమంలో అక్కడ నిలిపి ఉంచిన ఒక బస్సును కూడా ఈ వాహనాలు ఢీకొట్టాయి. క్షతగాత్రులను బిహ్పూర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని జవహర్‌లాల్ నెహ్రూ ఆసుపత్రికి తరలించారు. అయితే, మృతులందరూ నవ్‌గచ్చియా నివాసితులుగా తెలుస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కట్‌ఘోరా అంబికాపుర్ జాతీయ రహదారిపై బొగ్గు లోడ్‌తో వెళ్తున్న ట్రైలర్, సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఉదయం 8 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. బొగ్గుతో నిండిన ట్రైలర్ కోర్బా నుంచి వస్తుండగా, సిమెంట్‌తో నిండిన ట్రక్కు అంబికాపుర్ నుంచి వస్తోంది. అయితే, రెండు వాహనాలు వేగంగా వెళ్తుండడంతో ఒక వంపు వద్ద నియంత్రణ కోల్పోయి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సిమెంట్ వాహనం డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకున్నాడు. అయితే, రెండు వాహనాలు ఒకదానికొకటి బలంగా ఢీకొనడంతో వాటిలో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అయితే, కట్‌ఘోరా నుంచి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకోవడానికి చాలా సమయం పట్టిందని స్థానికులు చెబుతున్నారు. జాతీయ రహదారిపై నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించడానికి మోర్గా అవుట్ పోస్ట్ లేదా టోల్ నాకా వద్ద అగ్నిమాపక యంత్రాన్ని ఉంచాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


చెప్పేడు మాటలతో చేటే..



అత్తా, కోడలు ఇంటింటా తప్పకుండా వుంటారు. నేటి టీవీ సీరియల్స్‌లో అత్తాకోడలు మధ్య అనేక మనస్పర్థలు ఏర్పడినట్లు చూపిస్తారు. కొన్నింటిలో విలన్ అత్త, హీరోయిన్ కోడలు అని చిత్రిస్తారు. ఏది ఏమైనా అత్తాకోడలు అనుబంధం ఈనాటిది కాదు. తరతరాలుగా వస్తున్న సాంప్రదాయం.. తెలుగింటి కోడలితో కళకళలాడుతూ వుండాలి. అత్తగారు కూడా ఒక తల్లి మాదిరిగా సంస్కారవంతంగా ప్రవర్తిస్తే అసలు సమస్యే వుండదు. కీచులాటలు, తగవులు వారికి సరికావని గ్రహించాలి. 'అత్తా ఒకింటి కోడలే' అన్న విషయం మరువరాదు. నేటి సామాజిక పరిస్థితుల్లో అత్తా కోడలు ప్రముఖ పాత్ర వహిస్తున్నారు కాబట్టి అత్తాకోడలు తమ తమ స్థితిగతులను బట్టి నడుచుకుంటేనే మంచిది. కోడలు ఉత్తమ ఇల్లాలుగా భర్తకు సేవలందించాలి. అత్త తన వంతు కర్తవ్యం తాను నెరవేర్చాలి. తాను ఒక తల్లిలాంటిదని ఆమె గ్రహించాలి. అత్తాకోడలు అనుబంధం పదికాలాలపాటు కళకళలాడుతూ వుండాలంటే.. అత్తాకోడలు పరస్పర సహకారంతో మసలుకోవాలి. అలాగాకుండా అత్త ఒక విలన్‌లా ప్రవర్తించరాదు. కోడల్ని తన కన్నకూతురిలా చూసుకున్న రోజు.. కోడలు కూడా ఆమెను ఒక తల్లిగా ఆదరిస్తుంది. అంతేగాని చీదరించుకునేలా ప్రవర్తించదు. అన్నీ పనులు కోడలికే చెప్పి తాను ఖాళీగా కూర్చోవటం బాగుండదు. తనకు చేతనైన పని తాను చేస్తూ.. మిగతా పనులు కోడలికి చెప్పాలి. ఒకరినొకరు చేదోడు వాదోడుగా వున్న నాడు అత్తాకోడలి మధ్య అసలు తగవులే వుండవు. వారిరువురిమధ్య చక్కని అవగాహన ఉంటే అనుబంధం వెల్లివిరుస్తుంది. వారిమధ్య అన్యోన్యత పెంపొందగలదు. ముఖ్యంగా అత్తాకోడలు చెప్పుడు మాటలు, అమ్మలక్కల మాటలు వినకూడదు. మంచిని స్వీకరించాలి. చెడు పలుకులకు దూరంగా వుండాలి. వాళ్లు అలాంటివారు, వీళ్లు అలాంటివారు అన్న కాకమ్మ కబుర్లకు దూరంగా వుంటే మంచిది. కుటుంబ కలహాలకు చాలావరకూ దూరంగా వుండాలి. అత్తా ఒకింటి కోడలే అన్నపదం నిజం చేయాలి. ఒకరినొకరు మనస్ఫూర్తిగా అర్థం చేసుకోగలిగితే అసలు అత్తా కోడలు మధ్య విభేదాలే వుండవు. చాలా కుటుంబాలలో అత్తాకోడలు తగాదా అని వింటుంటాం. అవి ఎందుకొస్తాయి అన్నది ఆలోచిస్తే సమస్య వుండదు. తన కొడుకు కొత్త పెళ్లాం తెచ్చుకున్నాడు కదా అని మురిసిపోక ఆమెను అపురూపంగా చూసుకోవాలి. ఆప్యాయత, ఆదరణ, ఆడదానికి అవసరం అత్త ఒక తల్లిగా కోడల్ని ఆదరిస్తే చాలు, ఆ సంసారం నందనవనం కాగలదు. కోడలు సైతం అత్తగారిని తల్లిగా గౌరవించాలి. సంస్కారంగా వుండాలి. తెలుగింటి అనుబంధం చవిచూపగలగాలి. అందరికీ ఆదర్శంగా వుండాలి. పక్కింటి పుల్లమ్మ, ఎదురింటి నల్లమ్మలతో ప నేంటి? ఒకరినొకరు ప్రేమ పూర్వకంగా వుంటే అత్తాకోడలి అనుబంధం సంసార సౌభాగ్యానికి నవోదయం కాగలదు. వారిరువురూ నేటి తరానికి ఆదర్శంగా నిలవాలి. ఆనాడే ఆనందపు సంసారానికి శుభోదయం.







మహిళల టీ20 ప్రపంచ కప్ షెడ్యూల్ విడుదల

పురుషుల టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లను ఎంజాయ్ చేస్తున్న అభిమానులకు మరో తీపికబురు. మహిళల టీ 20 వరల్డ్‌కప్ షెడ్యూల్ కూడా వచ్చేసింది. మెగా టోర్నీకి మరో నాలుగు నెలలే ఉన్నందున ఐసీసీ మంగళవారం షెడ్యూల్ ప్రకటించింది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ ఒకే గ్రూప్‌లో ఉండగా.. తొలిసారి మెగా టోర్నీకి అర్హత సాధించిన నెదర్లాండ్స్ సైతం ఇదే గ్రూప్‌లో నిలిచింది. ఇంగ్లండ్ గడ్డపై జూన్ 12వ తేదన మహిళల వరల్డ్‌కప్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది క్రికెట్ అభిమానులకు పండుగ సీజనే. మార్చి 8వ తేదీన పురుషుల టీ20 వరల్డ్ కప్ ముగిసిన మూడు నెలలకే మహిళల పొట్టి ప్రపంచకప్ మొదలవ్వనుంది. జూన్ 12వ తేదీ నుంచి జూలై 5వ తేదీ వరకూ అభిమానులను అమ్మాయిల క్రికెట్ సమరం అలరించనుంది. మెగా ఈవెంట్ కు సమయం సమీపిస్తున్నందున.. ఐసీసీ, ఇంగ్లండ్ బోర్డు మంగళవారం గ్రూప్‌లను ఖరారు చేశాయి. మెగా టోర్నీలో పాల్గొంటున్న 12 జట్లను ఏ, బీ గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ ఏలో భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా వంటి మేటి జట్లతో పాటు బంగ్లాదేశ్, నెదర్లాండ్స్‌కు చోటు దక్కింది. గ్రూప్ బీలో మాజీ ఛాంపియన్లు న్యూజిలాండ్, వెస్టిండీస్, ఇంగ్లండ్‌తో స్కాంట్లాడ్, ఐర్లాండ్ లీగ్ దశలో తలపడనున్నాయి.

గ్రూప్ ఏ – భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్.

గ్రూప్ బీ – వెస్టిండీస్, ఇంగ్లండ్, న్యూజిలాండ్, శ్రీలంక, ఐర్లాండ్, స్కాట్లాండ్.

జూన్ 12న ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగే ఆరంభ పోరులో ఆతిథ్య ఇంగ్లండ్‌ను శ్రీలంక ఢీకొట్టనుంది. అభిమానులు ఆతృతగా ఎదురుచూసే భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జూన్ 14న జరుగనుంది. మొత్తంగా ఏడు వేదికల్లో 33 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఓల్డ్ ట్రఫోర్డ్, హెడింగ్లే, హ్యాంప్‌షైర్ బౌల్, బ్రిస్టల్ కౌంటీ గ్రౌండ్, ఎడ్జ్‌బాస్టన్, ది ఓవల్‌లో లీగ్ దశ, సెమీస్ మ్యాచ్‌లు ఉంటాయి. టైటిల్ పోరును ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానంలో ఆడిస్తారు.

పాకిస్తాన్ ను చిత్తు చేసి సెమీస్‌లో ఇంగ్లండ్

టీ20 ప్రపంచకప్‌ను రెండుసార్లు కొల్లగొట్టిన ఇంగ్లండ్ మూడో కప్ వేటలో మరో అడుగు వేసింది. పల్లెకెలె స్టేడియంలో వన్ మ్యాన్ షోతో చెలరేగిన హ్యారీ బ్రూక్ సెంచరీతో గర్జించగా.. పాకిస్థాన్‌పై రెండు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది ఇంగ్లండ్. వరుసగా రెండో విజయంతో గ్రూప్ బీ నుంచి తొలి సెమీస్ బెర్తు పట్టేసింది. మొత్తంగా ఐదోసారి పొట్టి కప్‌లో సెమీఫైనల్ గడప తొక్కిందీ మాజీ ఛాంపియన్. పాక్‌పై శతకంతో కదం తొక్కిన బ్రూక్ పొట్టి వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్ తరఫున మూడో అత్యధిక స్కోర్ నమోదు చేశాడు. లీగ్ దశలో వెస్టిండీస్ చేతిలో 30 పరుగుల ఓటమితో తేరుకున్న ఇంగ్లండ్.. నాకౌట్‌లో మాత్రం ప్రత్యర్థులపై పంజా విసురుతోంది. శ్రీలంకను 51 పరుగుల తేడాతో చిత్తు చేసిన బ్రేక్ సేన.. పాకిస్థాన్‌పై 2 వికెట్లతో గెలుపొంది సెమీస్‌కు దూసుకెళ్లింది. 2016నుంచి 2026 మధ్య కాలంలో ఆ జట్టు సెమీస్ చేరడం ఇది ఐదోసారి. పాక్, శ్రీలంక నాలుగేసి పర్యాయాలు సెమీస్ ఆడాయి. టీ20 వరల్డ్‌కప్ ఛేదనలో అత్యధిక స్కోర్.. రికార్డు ఇంగ్లండ్‌కే చెందిన అలెక్స్ హేల్స్ పేరిట ఉంది. 2014లో అతడు శ్రీలంకపై 116పరుగులతో అజేయంగా జట్టును గెలిపించాడు. 2016లో క్రిస్ గేల్ (100నాటౌట్) ఇంగ్లండ్‌పై, పథుమ్ నిశాంక(100 నాటౌట్) 2026 ఎడిషన్‌లో ఆస్ట్రేలియాపై సెంచరీలు బాదగా.. హ్యారీ బ్రూక్ పాక్‌పై శతకంతో ఈ జాబితాలో చేరాడు. ఇంగ్లండ్ తరఫున టీ20 వరల్డ్‌కప్‌లో సెంచరీ బాదిన ఆటగాళ్లలో హ్యారీ బ్రూక్‌ది మూడో స్థానం. అగ్రస్థానంలో అలెక్స్ హేల్స్ ఉండగా.. 2021 ఎడిషన్‌లో శ్రీలంకపై షార్జాలో శతక్కొట్టిన జోస్ బట్లర్ రెండో ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్ తరఫున మూడు ఫార్మాట్లలో సెంచరీ వీరుల జాబితాలో ముగ్గురే ఉన్నారు. వీరిలో బట్లర్, డేవిడ్ మలన్ ఉండగా.. తాజా సెంచరీతో బ్రూక్ కూడా చోటు సంపాదించాడు.



జట్టులోకి అక్షర్ పటేల్

- కుటుంబ కారణాలతో ఇంటికి రింకూ సింగ్

ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ ప్రస్తుతం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నది. దక్షిణాఫ్రికా చేతిలో భారీ ఓటమి తర్వాత సెమీఫైనల్ బెర్తు అవకాశాలను కఠినంగా మారడంతో మిగిలిన రెండు మ్యాచ్‌లు టీమ్‌ఇండియాకు కీలకంగా మారాయి. జింబాబ్వేతో పోరు కోసం మంగళవారం భారత క్రికెటర్లు నెట్స్‌లో చెమటోడ్చారు. సఫారీలతో పోరులో తుది జట్టు కూర్పుపై తీవ్ర విమర్శలు రావడంతో మేనేజ్ మెంట్ దిద్దుబాటు చర్యలకు దిగింది. వాషింగ్టన్ సుందర్ స్థానంలో వైస్ కెప్టెన్ అక్షర్‌పటేల్ దాదాపు ఖరారు అయినట్లు తెలుస్తున్నది. నెట్ సెషన్‌లో చాలాసేపు బౌలింగ్ చేయడం దీనికి మరింత బలాన్ని చేకూరుస్తున్నది. మరోవైపు కుటుంబ కారణాల రీత్యా రింకూసింగ్ ఉన్నఫళంగా ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. తన తండ్రి కాన్‌చంద్‌సింగ్ ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో దవాఖానలో చేర్పించినట్లు జట్టు వర్గాలు పేర్కొన్నాయి. దీంతో జింబాబ్వే పోరుకు రింకూ అందుబాటులో ఉండేది అనుమానంగా మారింది. రింకూ స్థానంలో శాంసన్‌ను తీసుకుంటారా లేక కుల్దీప్‌యాదవ్‌కు బెర్తు దక్కుతుందా అన్నది తేలాల్సి ఉంది.




తొలి వన్డేలో ఆస్ట్రేలియా విజయం

భారత్‌తో స్వదేశంలో ఇటీవలే ముగిసిన టీ20 సిరీస్‌లో ఓడిన ఆస్ట్రేలియా మహిళల జట్టు.. వన్డే సిరీస్‌ను మాత్రం విజయంతో ఆరంభించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం ఇక్కడ జరిగిన తొలి వన్డేలో హర్మన్‌ప్రీత్ కౌర్ సేనను 6 వికెట్ల తేడాతో ఓడించింది. బ్యాటింగ్ వైఫల్యంతో భారత్ ఓటమిని మూటగట్టుకుంది. మొదట బ్యాటింగ్ చేస్తూ 52 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన జట్టును స్మృతి మంధాన (58), హర్మన్‌ప్రీత్ (53) ఆదుకున్నారు. మహిళల వన్డే ప్రపంచకప్ తర్వాత తొలి మ్యాచ్ ఆడిన ప్రతీక డకౌట్ అవగా షెఫాలీ, జెమీమా, దీప్తి సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు. ఆఖర్లో కాశ్వీ గౌతమ్ (43) రాణించడంతో 48.3 ఓవర్లకు భారత్ 214 పరుగుల నామమాత్రపు లక్ష్యాన్ని ప్రత్యర్థి ఎదుట ఉంచగల్గింది. ఆసీస్ బౌలర్లలో ఆష్లీ గార్డ్‌నర్ (3/33), మేగన్ షట్ (2/42) రాణించారు. లక్ష్యాన్ని కంగారూలు 38.2 ఓవర్లలోనే పూర్తిచేశారు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' బెత్ మూనీ (76), కెప్టెన్ అలిస్సా హీలి (50) అర్ధ శతకాలతో రాణించారు.



ప్యారడైజ్... 'ఆయా షేర్'

కల్ట్ హిట్ దసరా తర్వాత నేచురల్ స్టార్ నాని, విజనరీ మేకర్ శ్రీకాంత్ ఓదెల బిగ్ కాన్వాస్‌పై బిగ్గెస్ట్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్ కోసం రెండవసారి కలిశారు. SLV సినిమాస్ ఆధ్వర్యంలో సుధాకర్ చెరుకూరి ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని ప్రపంచ స్థాయి స్థాయిలో రూపొందిస్తున్నారు. ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసిన ఈ చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ ఆయా షేర్ ప్రోమో వైరల్ అయ్యింది, అంచనాలను భారీగా పెంచింది. ఇప్పుడు విడుదలైన ఫుల్ ట్రాక్ తో రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ అంచనాలని నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్ళాడు. ట్రైబల్ పర్కషన్‌తో పాటు గ్రిటీ ఎలక్ట్రానిక్ సౌండ్స్‌ను కలిపి, ప్రైమల్ ఎనర్జీతో నిండిన థండరస్ మ్యూజిక్ ఎక్స్‌పీరియన్స్ అందించాడు. సెలబ్రేషన్, అడ్రినలిన్ రెండింటి మేళవింపుగా ఈ పాట అదిరిపోయింది. కాసర్ల శ్యామ్ రాసిన సాహిత్యం "షేర్" రాకను సూచిస్తూ ఆకలి, ఆధిపత్యం, టెర్రిటోరియల్ పవర్‌తో నిండిన అంథమ్‌లా వినిపిస్తుంది. ప్రముఖ తెలంగాణ జానపద గాయకులు అద్దుల జంగిరెడ్డి, అకునూరి దేవయ్య తమ శక్తివంతమైన వోకల్స్ తో పాటను మరింత ఎత్తుకు తీసుకెళ్లారు. నాని ట్రాన్స్‌ఫర్మేషన్ ఈ పాటలో హైలెట్ గా నిలిచింది. జడలతో కూడిన హెయిర్ స్టైల్, గడ్డం, రెడ్ బ్లేజర్‌తో రగ్గడ్ లుక్‌లో ఆయన వారియర్, ఐకాన్‌లా కనిపిస్తున్నారు. నాయకుడిగా ఆయన స్వాగ్ అదిరిపోయింది. సుధన్ మాస్టర్ కొరియోగ్రఫీ ఈ పాటకు మరింత మ్యాడ్ ఎనర్జీని జోడించింది. నాని డాన్స్ అదిరిపోయింది. హుక్ స్టెప్ నుంచి ఫ్లోర్ మూవ్స్ వరకు అన్నీ వైరల్ అవుతున్నాయి. బిర్యానీ హాండీలతో వచ్చే ఎంట్రీ నుంచి చివర్లో సింహాసనంపై కూర్చునే ఎగ్జిట్ వరకు ప్రతి ఫ్రేమ్ లో ఆయన ప్రెజెన్స్ నెక్స్ట్ లెవల్ లో వుంది. శ్రీకాంత్ ఓదెల ఇక్కడ సృష్టించిన విజువల్ యూనివర్స్ అద్భుతంగా, రఫ్‌గా కనిపిస్తున్నాయి. భారీ స్థాయి, ఇంటిమేట్ ఎమోషన్స్ రెండింటినీ కలిపిన ఈ వరల్డ్, ఈ జానర్‌లో ఇప్పటివరకు ఎన్నడూ చూడడని అద్భుతంగా కనిపిస్తోంది.



'మేడ్ ఇన్ కొరియా'

మార్చి 12న నెట్‌ఫ్లిక్స్ లో...

రైజ్ ఈస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణంలో, రా.కార్తిక్ రచించి దర్శకత్వం వహించిన ఈ చిత్రం మేడ్ ఇన్ కొరియా. ప్రియాంక మోహన్, దక్షిణ కొరియా నటుడు పార్క్ హైజిన్ ప్రధాన పాత్రల్లో నటించారు. తమిళనాడులోని ఒక చిన్న పట్టణానికి చెందిన శెన్బా కి దక్షిణ కొరియాకు వెళ్లాలని గొప్ప కల ఉంది. ఆ కల నిజమవుతున్న ప్రయాణాన్ని చూపించే 'మేడ్ ఇన్ కొరియా' చిత్రం మార్చి 12న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. దర్శకుడు రా.కార్తిక్ మాట్లాడుతూ, "కొరియన్, తమిళ సంస్కృతుల మధ్య ఉన్న చారిత్రక అనుబంధాలు నాకు ఎంతో ఆసక్తిని కలిగించాయి. అదే ప్రేరణతో ఈ కథను రూపొందించాను. 'మేడ్ ఇన్ కొరియా' హత్తుకునే స్లైస్‌ఆఫ్‌లైఫ్ చిత్రం. భాషల్ని దాటి ప్రపంచ సంస్కృతులను కలుపుతున్న కథలను ప్రోత్సహించిన నెట్‌ఫ్లిక్స్‌కు ధన్యవాదాలు," నెట్‌ఫ్లిక్స్ ఇండియా కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ మోనికా షెర్గిల్ మాట్లాడుతూ, "దక్షిణాది కథలపై మా దృష్టిని మరింత బలోపేతం చేస్తూ, స్థానిక సంస్కృతిలో నాటుకుపోయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను తాకే కథలను తీసుకురావడమే మా లక్ష్యం. తమిళనాడులోని ఒక చిన్న గ్రామం నుంచి వచ్చిన అమ్మాయి కలల కథగా 'మేడ్ ఇన్ కొరియా'ను అద్భుతంగా ప్రతిబింబిస్తుంది. ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో ప్రియాంక మోహన్ నటిస్తూ, శెన్బా భావోద్వేగ ప్రయాణాన్ని ఎంతో సహజంగా ఆవిష్కరించారు. 'స్క్విడ్ గేమ్' ఫేమ్ దక్షిణ కొరియా నటుడు పార్క్ హ్యేజిన్‌తో పాటు నో హోజిన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తన పాత్ర గురించి ప్రియాంక మోహన్ మాట్లాడుతూ, "శెన్బా కలలు ఆశ్చర్యం, ఆసక్తి నుంచి పుట్టినవి. కథ మొదట వినగానే నాకు ఆ పాత్రతో బలమైన అనుబంధం ఏర్పడింది. నెట్‌ఫ్లిక్స్ చిత్రంలో భాగం కావడం మరింత ప్రత్యేకంగా అనిపిస్తోంది. మేడ్ ఇన్ కొరియా' చిత్రం మార్చి 12న నెట్‌ఫ్లిక్స్‌లో ప్రత్యేకంగా స్ట్రీమింగ్ కానుంది.



ఏడుస్తూ నిద్రపోయేదాన్ని!

'బాడీ షేమింగ్‌కు గురై తీవ్రమైన మానసిక వ్యధకు లోనైన సందర్భాలు నా జీవితంలో కోకొల్లలు' అని బాలీవుడ్ భామ మృణాళ్‌ఠాకూర్ అన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె తన శరీర బరువుపై ఎదుర్కొన్న ట్రోలింగ్ గురించి మాట్లాడారు. 'ఆ రోజులింకా నా కళ్లలో కదులుతూనే ఉన్నాయి. ఏడ్చీ ఏడ్చీ అలసిపోయి నిద్రపోయేదాన్ని. పొద్దున్నే లేచేసరికి కళ్లు ఉబ్బిపోయి ఉండేవి. నేను అప్పట్లో కాస్త బొద్దుగా ఉండేదాన్ని. దాంతో నా చుట్టూ ఉండేవారే నన్ను ట్రోల్ చేసేవారు. ఆ ట్రోలింగ్ ప్రభావంతో ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయేదాన్ని. అలాంటి సమయంలో అక్షయ్‌కుమార్ మాటలు నాలో మార్పుని తెచ్చాయి. 'ట్రోలింగ్ వినకుండా ముందుకు సాగాలి. పాత్ర కోసం సన్నగా మారాల్సివస్తే కచ్చితంగా మారాలి' అని ఆయన చెప్పిన ఆ మాటలు నాపై బలంగా పనిచేశాయి. అప్పట్నుంచీ నా శరీరాకృతి గురించి ఆందోళన చెందడం మానేశాను. ఓ రోజు జిమ్‌కు వెళ్లినప్పుడు అక్కడ సన్నగా నాజూగ్గా ఉండే అమ్మాయిలు నా దగ్గరకొచ్చి 'మీలా మేమూ మారాలంటే ఏం చేయాలి?' అని అడిగారు. మనం ఎలా ఉన్నా నచ్చేవాళ్లకు నచ్చుతామని అప్పడర్థమైంది. ముందు మనల్ని మనం గౌరవించుకుంటే. ఆటోమేటిగ్గా ఎదుటివారు మనల్ని గౌరవిస్తారు' అంటూ చెప్పుకొచ్చింది మృణాళ్‌ఠాకూర్.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013. Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200